KR TV

మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :49 | ఆదివారం , 19 జనవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

## హైదరాబాద్‌లో
# మరో ఏఐ డేటా సెంటర్




- రూ.3500 కోట్ల పెట్టుబడులు.. ఎస్టీటీ కీలక ఒప్పందం
- మీర్‌ఖాన్‌పేటలో ఏఐ ఆధారిత డేటా సెంటర్ ఏర్పాటుకు అవగాహనా ఒప్పందం
- సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో జయేష్ రంజన్ సంతకాలు
- 100 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటుకు ప్రణాళిక
- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సామర్థ్య విస్తరణ
- దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్లలో ఒకటిగా నిలవనున్న ఈ ప్రాజెక్టు

**హైదరాబాద్,18జనవరి(క్రాంతిన్యూస్):** తెలంగాణలో మరో కంపెనీ భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. సింగపూర్‌లో రెండో రోజు పర్యటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి బృందం.. మరో ప్రముఖ కంపెనీతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్‌లో రూ. 3,500 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు.. ఎస్టీ టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్ ముందుకొచ్చింది. ఇప్పటికే నగరంలోని హైటెక్ సిటీలో ఓ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసిన ఎస్టీటీ ఇప్పుడు.. ముచ్చర్ల సమీపంలోని మీర్‌ఖాన్‌పేటలో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కారుతో ఎస్టీటీ అవగాహన ఒప్పందం చేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు సింగపూర్‌లోని ఎస్టీటీ గ్లోబల్ డేటా సెంటర్ ఆఫీస్‌ను సందర్శించారు. ఆ కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎస్టీటీ గ్రూప్ సీఈవో బ్రూనో లోపెజ్.. అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశారు.

100 మెగావాట్ల సామర్థ్యంతో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్‌ను ఎస్టీటీ కంపెనీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పనుంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా డేటా సెంటర్ సామర్థ్యాన్ని పెంచుకునే సదుపాయం కూడా ఇందులో ఉండనుంది.

2లో

# వేలానికి కేపీహెచ్‌బీ బోర్డు స్థలాలు?




**హైదరాబాద్,18జనవరి(క్రాంతిన్యూస్):** హైదరాబాద్‌లో స్థలం కొనాలనుకుంటున్న వారికి అధికారులు మంచి అవకాశం కల్పించారు. నగరంలోని హౌసింగ్ బోర్డు స్థలాలను అమ్మాలని నిర్ణయించారు. అయితే.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్కడక్కడా కొన్ని ఏళ్లుగా మిగిలిపోయిన హౌసింగ్ బోర్డు స్థలాలను బహిరంగ వేలం ద్వారా అమ్మేయాలని అధికారులు నిర్ణయించారు. 3 డివిజన్ల పరిధిలోని 73 ప్లాట్లను అమ్మకానికి పెట్టారు. అన్నీ కలిపి 4,880.98 చదరపు గజాల స్థలం ఇప్పుడు అమ్మకానికి ఉంది. ఇందులో.. 3,040.18 చదరపు గజాల ప్లాట్లు 24, 566.09 చదరపు గజాల ప్లాట్లు 07, 1,274.71 చదరపు గజాలవి 42 ప్లాట్లు ఉన్నాయి. ఇందులో అతి తక్కువగా 6.11 చదరపు గజాలు అయితే.. అత్యధికం 290 చదరపు గజాల స్థలాలు అందుబాటులో ఉన్నాయి. అయితే.. ఇవన్నీ కూకట్పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలోని 4 ఫేజుల్లోనే ఉండటం గమనార్హం.

2లో

## ఏపీని ఊరిస్తున్న అద్భుత అవకాశం!
మరో మూడు రాష్ట్రాలతో పోటీ?




2లో

## ఫార్ములా ఈ-రేసు కేసులో ఏస్‌నెక్స్ట్‌జెన్‌ను ప్రతినిధుల విచారణ




4లో



## రైతు నాగోరావు ఆత్మహత్యకు
# ప్రభుత్వానిదే బాధ్యత : కేటీఆర్



**హైదరాబాద్,18జనవరి(క్రాంతిన్యూస్):** ఆదిలాబాద్ రైతు నాగోరావు ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యతని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ చేయకపోవడంతో ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సైదుపూర్‌కు చెందిన రైతు నాగోరావు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరిట రుణం ఉన్న బ్యాంకులోనే పురుగుల మందు తాగి ఆ రైతు బలన్మరణానికి పాల్పడ్డాడంటే.. ఆ రుణభారం రైతన్నను ఎంత మానసిక వేధనకు గురిచేసిందో అర్థమవుతుందన్నారు. ఆ అన్నదాత నిండు జీవితం బలికావడానికి రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పేరిట చేసిన మహామోసం తోపాటు రైతు వ్యతిరేక విధానాలే ప్రధాన కారణమన్నారు. పదేళ్లపాటు రాజుగా బతికిన రైతన్న ఈ రోజు ఇందిరమ్మ రాజ్యంలో అవస్థల పాలవుతూ అరిగోస పడుతున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అన్నదాతలను పట్టించుకోవడం లేదన్నారు.

2లో

# రుణం కట్టాలని వేధింపులు..
## బ్యాంకు ముందే పురుగుల మందు తాగిన రైతన్న

**ఆదిలాబాద్ ,18 జనవరి (క్రాంతిన్యూస్ ):** బ్యాంకు అధికారుల వేధింపులకు రైతన్న బలయ్యాడు. వాళ్ల వేధింపులు తాళలేక బ్యాంకు ముందుకొచ్చి పురుగుల మందు తాగాడు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈ విషాద ఘటన జరిగింది.వివరాల్లోకి వెళ్తే.. బేల మండలం సైదుపూర్‌కు చెందని జాదవ్ నాగోరావు అనే రైతు ఆదిలాబాద్ ఐసీఐసీఐ బ్యాంకులో రుణం తీసుకున్నాడు. తనకు ఉన్న ఐదెకరాల వ్యవసాయ భూమిని మార్టిగేజ్ చేసి 3.50 లక్షల రూపాయల రుణం తీసుకున్నాడు. దీనికి ఆరు నెలలకు ఒకసారి రూ.25వేల కిస్తీ చెల్లించాల్సి ఉంది. కానీ గత రెండు నెలలుగా జాదవ్ కిస్తీ చెల్లించలేకపోయాడు.సమయానికి కిస్తీ కట్టకపోవడం బ్యాంకు అధికారులు జాదవ్ జాగోరావుపై ఒత్తిడి తీసుకొచ్చారు.



2లో

# రేవంత్ డబ్బా కొట్టుకోవడం మానెయ్యి
**- హరీశ్‌రావు**




సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలపై బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇచ్చిన హామీలు అమలు చేశామని ఢిల్లీకి వెళ్లి అబద్ధాలు ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారూ.. మీ పాలనలో వేతనాలు అందక ఉద్యోగులు రోడ్డెక్కుతున్న దుస్థితి నెలకొందని తెలిపారు. ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తామని అధికారంలోకి వచ్చిన మీకు చిరు ఉద్యోగుల కష్టాలు కనిపించకపోవడం దురదృష్టకరమని అన్నారు.

2లో

## నేటిమాట

ప్రాణకోటిని, తోటి మనుషుల్ని ప్రేమగా చూడలేని వారు ఎప్పటికీ సంతోషంగా ఉండలేరు.



-మార్టిన్ లూథర్ కింగ్

# రైతులకు సోలార్ పంపుసెట్లు పంపిణీ
**- డిప్యూటీ సీఎం భట్టి**



తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ రైతులకు శుభవార్త మీద శుభవార్తలు చెబుతూనే ఉంది. మొన్ననే అన్నదాతల రుణాలు మాఫీ చేసిన సర్కార్.. ఇప్పుడు జనవరి 26 నుంచి రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేలు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. ఇక.. భూమిలేని రైతు కూలీలకు కూడా ఇందిర ఆత్మీయ భరోసా పథకం కింద రూ.12 వేల ఆర్థిక సాయం అందించనున్నట్టు తెలిపింది. ఈ క్రమంలోనే.. మరో శుభవార్త వినిపించారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.

2లో

# ‘అలా అంటే ’ చెంప చెళ్లుమనిపించండి
**- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



**హైదరాబాద్,18జనవరి(క్రాంతిన్యూస్):** కేంద్ర, రాష్ట్ర రాజకీయాలతోపాటు బీజేపీ సంస్థాగత ఎన్నికలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను బీజేపీ జాతీయ అధ్యక్ష రేసులో లేనని.. అధిష్టానం ఇచ్చిన బాధ్యత చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరైనా ఎంపికవచ్చొని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో.. ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కానీ ఢిల్లీలో డప్పు కొట్టుకుంటున్నాడని.. వాటిని ఎవరూ నమ్మరని స్పష్టం చేశారు.తాజా రాజకీయ పరిణామాలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శనివారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

2లో

# కేజ్రీవాల్‌పై దాడి



ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం కొనసాగుతోంది. అరవింద్ కేజ్రీవాల్‌పై బీజేపీ నేత పర్వేష్ వర్మ అనుచరులు దాడి చేశారని శనివారం ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. కేజ్రీవాల్ కారుపై రాళ్లు రువ్వారని పేర్కొంది. కేజ్రీవాల్ న్యూఢిల్లీ అసెంబ్లీలో ప్రచారం చేస్తున్నప్పుడు ఆయనపై ఈ దాడి జరిగిందని పార్టీ వర్గాలు తెలిపాయి. స్థానికులు జోక్యం చేసుకుని దుండగులను తరిమికొట్టినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.ఆమ్ ఆద్మీ పార్టీ తన సోషల్ మీడియా హ్యాండిల్‌లో ఆరోపించిన దాడికి సంబంధించిన వీడియోను కూడా షేర్ చేసింది.

2లో

KR TV మన క్రాంతి



# హైదరాబాద్‌లో మరో ఏఐ డేటా సెంటర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,18జనవరి(క్రాంతిన్యూస్): దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్లలో ఇది ఒకటిగా నిలుస్తుందని ప్రభుత్వం చెబుతోంది. దాదాపు రూ. 3,500 కోట్ల పెట్టుబడులతో ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు ఆ కంపెనీ ముందుకురావటమనేది.. తెలంగాణలో ఉన్న మౌలిక సదుపాయాలు, ప్రపంచస్థాయి అనుకూలతలను మరోసారి చాటి చెప్పినట్టయింది.

ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. త్వరలోనే హైదరాబాద్ నగరం డేటా సెంటర్లకు రాజధానిగా అవతరిస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చినందుకు ఎస్టీటీ గ్లోబల్ కంపెనీ ప్రతినిధులను రేవంత్ రెడ్డి అభినందించారు.

మరోవైపు.. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేయటం గౌరవంగా ఉందని ఎస్టీటీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్స్ ప్రెసిడెంట్, గ్రూప్ సీఈవో బ్రూనో లోపెజ్ చెప్పుకొచ్చారు. మౌలిక సదుపాయాలతో పాటు తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రగతిశీల విధానాలు సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహకంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం అందించే సహకారంతో ఆర్థికవృద్ధితో పాటు ఉపాధి కల్పన, స్థిరమైన డిజిటల్ భవిష్యత్తు నిర్మించాలనే ఉమ్మడి లక్ష్యం నెరవేరుతుందన్నారు.

ప్రపంచానికి హైదరాబాద్ నగరం ఒక డేట్ హబ్‌గా మారుతుందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ ఆధారిత రంగంలో వస్తున్న వినూత్న మార్పుల్లో హైదరాబాద్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని చెప్పుకొచ్చారు.

ఎస్టీ టెలీ మీడియా గ్లోబల్ సంస్థ.. ప్రస్తుతం హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఓ డేటా సెంటర్‌ను నిర్వహిస్తోంది. కొత్త క్యాంపస్ ఏర్పాటుతో కంపెనీ కార్యకలాపాలను విస్తరించనుంది. ఈ కంపెనీ పదేళ్ల వ్యవధిలో.. దేశంలో ఒక గిగావాట్ సామర్థ్యానికి విస్తరించాలనే లక్ష్యంతో తెలంగాణలో పెట్టుబడులు పెడుతోంది. దశాబ్దంలో ఈ కంపెనీ దాదాపు 3.2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# వేలానికి కేపీహెచ్‌బీ బోర్డు స్థలాలు?

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,18జనవరి(క్రాంతిన్యూస్): కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ప్రాంతంలోని ప్లాట్లకు అక్కడి మార్కెట్ ధరను బట్టి.. గజం రూ.1.25 లక్షలు, గచ్చిబౌలిలో గజం రూ.1.50 లక్షలు, రావిర్యాలలో రూ.75 వేల చొప్పున ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, రావిర్యాల దగ్గర తెలంగాణ హౌసింగ్ బోర్డు కాలనీలోని ఇళ్ల మధ్య ఉన్న 42 ప్లాట్లకు వేలం నిర్వహిస్తున్నట్టు బోర్డు ఓ ప్రకటన విడుదల చేసింది. ఫిబ్రవరి 5న రావిర్యాల తెలంగాణ హౌసింగ్ బోర్డు కాలనీలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు తెలిపింది. అయితే వేలంలో పాల్గొనేవారు రూ.లక్ష, రెండు లక్షల డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ)లను వేలం ప్రారంభమవడానికి 30 నిమిషాల ముందు డిపాజిట్ చేయాలని పేర్కొంది.

ఈ హౌసింగ్ బోర్డు స్థలాలు గతంలోనే వేలం వేసి అమ్మేయగా.. అక్కడక్కడా చిన్న చిన్న ప్లాట్లు మిగిలిపోయాయి. మిగిలిపోయిన వాటితో పాటు గతంలో నిర్వహించిన వేలంలో కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రాని స్థలాలను కూడా.. గుర్తించి అమ్మకానికి పెట్టారు. ఈ స్థలాల విక్రయం ద్వారా రూ.60 నుంచి రూ.65 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే.. జనవరిలోనే రెండు దఫాలుగా 31 స్థలాలకు వేలం నిర్వహించనుండగా.. వచ్చే నెల అంటే ఫిబ్రవరి 5న మిగిలిన 42 స్థలాలకు వేలం వేయాలని అధికారులు నిర్ణయించారు.

ఇవే కాకుండా.. గ్రేటర్ హైదరాబాద్‌లో ఖాళీగా ఉన్న ప్లాట్లు, ఫ్లాట్లు, అసంపూర్తిగా ఉన్న అపార్టుమెంట్లను.. మార్చిలో మరోసారి పెద్ద సంఖ్యలో వేలం వేసేందుకు అధికారులు ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం తక్కువ విస్తీర్ణంతో ఉన్నవాటితో పాటు కొన్నేళ్ల నుంచి ఖాళీగా ఉన్న వాటిని అమ్మేయాలని నిర్ణయించుకున్నట్టు ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. మార్చిలో సుమారు 2 వేలకు పైగా స్థలాలు వేలం పరిధిలోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం

ఈ ప్రకటన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీకి గండం వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. హౌసింగ్ బోర్డ్‌కు సంబంధించి స్థలాలను బహిరంగ వేలానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం కావడం సరికాదన్నారు. కాలనీకి సంబంధించిన 3 గజాల నుంచి 300 గజాలకు పైగా స్థలాలను అమ్మేందుకు ప్రకటన జారీ చేసిందని తెలిపారు.




'హౌసింగ్ బోర్డు స్థలాలకు సంబంధించి ఆరు గజాలు, మూడు గజాలు, 50 గజాలకు సంబంధించిన స్థలాలను ప్రభుత్వం అమ్ముకోవడం సరికాదు' అని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తప్పుబట్టారు. ప్రజలకు సంబంధించిన స్థలాలను ప్రభుత్వం అమ్మడం హేయమైన చర్య అని.. వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం వదిలేసిన స్థలాలను వేలం వేయడం ద్వారా వచ్చే సొమ్మును ప్రభుత్వం తీసుకోవాలని భావిస్తోందని వివరించారు. ప్రభుత్వ వేలంపాటలో పాల్గొనే వారికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరిక జారీ చేశారు. 'వేలంలో దక్కించుకున్న స్థలాలలో నిర్మాణాలను ఎట్టి పరిస్థితిలో అనుమతించం. వాటిని అడ్డుకునేందుకు కాలనీవాసులంతా సిద్ధంగా ఉన్నాం' అని ప్రకటించారు.

# రుణం కట్టాలని వేధింపులు..

## బ్యాంకు ముందే పురుగుల మందు తాగిన రైతన్న

మొదటిపేజీ తరువాయి

ఆదిలాబాద్,18జనవరి (క్రాంతిన్యూస్: ఆయనపై వేధింపులకు దిగారు. దీంతో బ్యాంకు అధికారుల వేధింపులు తాళలేక శనివారం ఉదయం పురుగుల మందు డబ్బాతో బ్యాంకుకు వచ్చాడు. అధికారుల ముందే పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన చుట్టుపక్కల వాళ్లు వెంటనే ఆయన్ను రిమ్స్‌కు తరలించారు. కానీ అప్పటికే జాదవ్ ప్రాణాలు కోల్పోయాడు. దీంతో బ్యాంకు ముందు మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు.

# రైతు నాగోరావు ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యత : కేటీఆర్

మొదటిపేజీ తరువాయి



అప్పులు తీరక అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడుతున్నా కనికరం లేని కాంగ్రెస్ సర్కారులో ఏమాత్రం చలనం లేదన్నారు. అధికారంలోకి రాగానే రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని ముఖ్యమంత్రి మాట తప్పడం.. రైతు భరోసా ఎత్తకొట్టడం వల్లే నాగోరావ్ అనే రైతు అన్యాయంగా బలయ్యారన్నారు. ఇది ఆత్మహత్యకానే కాదని.. ముమ్మాటికీ రేవంత్ సర్కారు చేసిన హత్యగానే తెలంగాణ రైతాంగం భావిస్తుందన్నారు. నాగోరావ్ మరణానికి కారణమైన ఈ ప్రభుత్వంపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతు కుటుంబానికి కనీసం రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి.. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రుణమాఫీ కాక దిక్కుతోచని స్థితిలో ఉన్న లక్షలాది మంది రైతుల అప్పులను వెంటనే మాఫీ చేసి, ప్రభుత్వం వారిని రుణవిముక్తులను చేయాలన్నారు. ఇలాంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.

పదేళ్లపాటు తెలంగాణలో గుండెలపై చేయి వేసుకుని హాయిగా బతికిన రైతుల జీవితాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పూర్తిగా అధికారం అలుముకుందన్న కేటీఆర్, ఒకప్పుడు సాగులో, పంట దిగుబడిలో నెంబర్ వన్‌గా ఉన్న తెలంగాణ, ఇప్పుడు అన్నదాతల ఆత్మహత్యల్లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉండడం కాంగ్రెస్ సర్కారు చేతకానితనానికి నిలువెత్తు నిదర్శనమని విమర్శించారు. అన్నదాతలారా.. దయచేసి ఆత్మహత్యలు చేసుకోవద్దు అంటూ కేటీఆర్ రైతన్నలకు విజ్ఞప్తి చేశారు. నమ్మించి మోసం చేసిన ఈ నయవంచక కాంగ్రెస్ సర్కారును నిలదీద్దాం.. హామీలు అమలయ్యే దాకా కొట్లాడి ముఖ్యమంత్రి మెడలు వంచుదాం.. తప్ప మీ ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదంటూ కేటీఆర్ పిలుపునిచ్చారు.

# 'అలా అంటే చెంప చెళ్లుమనిపించండి'

## - కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి



. ఈ క్రమంలోనే కొన్ని కీలక అంశాలపై స్పందించారు. 'స్థానిక సంస్థల ఎన్నికల్లో వినిపించే వాయిస్ బీజేపీ మాత్రమే. ఎందుకంటే బీఆర్ఎస్ బిల్లులు పెండింగ్ పెట్టింది. పంచాయతీల నిధులను మళ్లించింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా ప్రజలను మోసం చేస్తోంది' అని కిషన్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వమే గ్రామాలను అభివృద్ధి చేస్తోందని.. శ్మశాన వాటికల నుంచి నరేగా నిధుల వరకు అన్ని కేంద్రమే పంచాయితీలకు అందిస్తోంది' అని వెల్లడించారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద జీతాలు ఇచ్చేందుకు కూడా డబ్బుల్లేవు. వాళ్లు పంచాయతీలను ఏం అభివృద్ధి చేస్తారు?' అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అప్పుల కోసం చూస్తున్నాడు. ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది' అని విమర్శించారు. 'తెలంగాణలో 6 గ్యారెంటీలపై మోసం చేసిన రేవంత్ రెడ్డి ఢిల్లీలో అబద్ధాలు చెబుతున్నాడు. అతడి మాటలు ఎవరూ నమ్మరు' అని స్పష్టం చేశారు.

'ఉచితాలకు వ్యతిరేకమని బీజేపీ ఎన్నడూ చెప్పలేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆధారంగా హామీలు ఇవ్వాలని.. లేని పక్షంలో రాష్ట్రం దివాలా తీస్తుందని చెప్పాం' అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. 'బీర్, బ్రాందీ విక్రయించిన నిధులను కూడా రేవంత్ రెడ్డి మళ్లిస్తున్నాడంటే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు' అని సంచలన ఆరోపణలు చేశారు. 'ఏపీ పునర్విభజన చట్టం ప్రకారమే నిధులు ఇస్తున్నాం. స్టీల్ ప్లాంట్‌కు రూ.11,445 కోట్లు ఇచ్చాం' అని వివరించారు.

'కాంగ్రెస్ పార్టీ మాకు ప్రధాన రాజకీయ శత్రువు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అని ఎవడో ఏదో అన్న వ్యాఖ్యలున మమ్మల్ని అడగొద్దు. ఎవరైనా అలా అంటే చెంప చెళ్లుమనిపించండి' అని కిషన్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్‌పై కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'ముస్లింలే అసద్‌ను వ్యతిరేకిస్తున్నారు. ఆయన పరిస్థితి పిట్టల దొరలాగా మారింది. మోడీని ఓడిస్తా అన్నాడు. కానీ మూడుసార్లు ప్రధాని అయ్యారు. రామజన్మభూమి నిర్మిస్తే అంతు చూస్తామన్నారు.. మేం కట్టి చూపించాం' అని వివరించారు.

# కేజ్రీవాల్‌పై దాడి

మొదటిపేజీ తరువాయి

ఓటమి భయంతో బీజేపీ భయాందోళనకు గురవుతోందని ఆ పార్టీ పేర్కొంది. అరవింద్ కేజ్రీవాల్‌పై దాడి చేసేందుకు బీజేపీ తన గూండాలను సిద్ధం చేసింది. బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ గూండాలు కేజ్రీవాల్ ప్రచారం చేయకుండా ఇటుకలు, రాళ్లతో దాడి చేసి గాయపరిచేందుకు ప్రయత్నించారని ఆ పార్టీ ఆరోపించింది. ఈ పిరికి దాడికి కేజ్రీవాల్ భయపడరని ఆ పార్టీ పేర్కొంది. ఢిల్లీ ప్రజలు మీకు తగిన సమాధానం చెబుతారని హెచ్చరిస్తూ పోస్ట్ పెట్టింది ఆప్.

## బీజేపీ వెర్షన్

మరోవైపు తమ కార్యకర్తలపై ఆప్ వర్గాలు దాడికి యత్నించాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ ఘటన తర్వాత బీజేపీ నేత పర్వేష్ వర్మ కూడా గాయపడినవారిని పరామర్శించేందుకు లేడీ హార్డింజ్ ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ప్రవేష్ వర్మ తన సోషల్ మీడియా హ్యాండిల్‌లో షేర్ చేశారు. కేజ్రీవాల్ తన కారుతో ఇద్దరు బీజేపీ కార్యకర్తలను ఢీకొట్టారని ఆరోపించారు.

అయితే, ఢిల్లీ పోలీసు వర్గాల దాడి వార్తలను ఖండించాయి. ఇరువర్గాలు నినాదాలు చేయడంతో పాటు తోపులాటకు దిగాయని.. గోల్ మార్కెట్ సమీపంలో ఒకరి వాహనాలను ఒకరు ఆపుకునే ప్రయత్నాలు కూడా జరిగాయని తెలిపారు. అయితే పోలీసులు వారిని నిలువరించినట్లు వెల్లడించారు. ఎవరిపైనా దాడి జరగలేదన్నారు.

## న్యూఢిల్లీ స్థానంపై త్రిముఖ పోటీ

నిజానికి అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఈ స్థానం నుంచి బీజేపీ మాజీ ఎంపీ పర్వేశ్ వర్మను బరిలోకి దింపింది. అదే సమయంలో కాంగ్రెస్ ఈ స్థానం నుంచి సందీప్ దీక్షిత్‌కు టికెట్ ఇచ్చింది. కేజ్రీవాల్ గత ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన స్థానం న్యూఢిల్లీ. అయితే ఈసారి ఇక్కడ ముక్కోణపు పోటీ కనిపిస్తోంది.

# రేవంత్ డబ్బా కొట్టుకోవడం మానెయ్యి - హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

నాలుగు నెలలుగా పంచాయతీ కార్మికులు, మూడు నెలలుగా MGNREGS ఉద్యోగులు, నెల గడిచినా మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు అందక వెతలు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. MGNREGS లో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీఓలు ఇలా వేల మంది చిరు ఉద్యోగులు జీతాలు ఇవ్వాలని ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టుకున్న దయనీయ పరిస్థితి నెలకొందని అన్నారు. దాదాపు అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు.

నెలలు గడిచినా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమై, అప్పుల పాలవుతున్నారని తెలిపారు. కండ్లు కాయలు కేసులా జీతాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. కుర్చీ కాపాడుకోవడం కోసం ఢిల్లీకి చక్కర్లు కొట్టడం, విదేశాలకు వెళ్లి వేల కోట్ల పెట్టుబడులు తెస్తున్నామనే డబ్బా ప్రచారం చేసుకోవడం మానేసి పాలనపై దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటికైనా చిరు ఉద్యోగులందరికీ సకాలంలో వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రైతులకు సోలార్ పంపుసెట్లు పంపిణీ

## - డిప్యూటీ సీఎం భట్టి

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలోని రైతులకు వ్యవసాయ మోటర్లకు సోలార్ పంపుసెట్లు అందించనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు.

హైదరాబాద్‌లో శనివారం టీజీఎన్‌పీడీసీఎల్ సంస్థలో ఎంపికైన పలువురు జూనియర్ అసిస్టెంట్ అభ్యర్థులకు భట్టి విక్రమార్క నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి విక్రమార్క.. గడిచిన పదేళ్లలో నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదన్నారు. ముఖ్యంగా గ్రూప్-1 పరీక్ష రాయాలనే ఆశ.. చాలా మందికి గత పదేళ్లలో నెరవేరలేదని చెప్పుకొచ్చారు. ఉద్యోగాలు వస్తాయని రాష్ట్ర కోసం పోరాడితే అది నెరవేరలేదని చెప్పుకొచ్చారు. ఇందిరమ్మ రాజ్యం వస్తేనే ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులు భావించారని తెలిపారు. ప్రజాప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోనే 56 వేల మందికి నియామకపత్రాలు అందజేసిందని భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. విద్య, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు.

మరోవైపు రోజురోజుకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. భవిష్యత్‌లో విద్యుత్ డిమాండ్ 22,400 మెగావాట్లకు పెరగనుందని అంచనా వేశారు. ఫ్యూచర్ సిటీలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు చాలా ఉన్నాయనన్నారు. వచ్చే పదేళ్లలో పెరిగే అవసరాల దృష్ట్యా 31 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు రచిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. 2035 కల్ల 40 వేల మెగావాట్ల విద్యుత్‌ను ఈ రాష్ట్రంలో తయారు చేయడానికి విద్యుత్ శాఖ కసరత్తు చేస్తుందని హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత విద్యుత్ కోసం విద్యుత్ శాఖకు ప్రతి నెలా రూ.148 కోట్లు చెల్లిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రైతుల మోటర్లకు సోలార్ పంపుసెట్లు అందించాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసినట్లు భట్టి స్పష్టం చేశారు. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద 25 గ్రామాల్లో సోలార్ పంపుసెట్లు అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణ మొత్తం సోలార్ పంపుసెట్లు అందించనున్నట్టు ప్రకటించారు.

# ఫార్ములా ఈ-రేసు కేసులో

## ఏస్‌నెక్స్ట్‌జెన్‌ను ప్రతినిధుల విచారణ



ఫార్ములా ఈ-రేసు కేసులో మొదట్లో కీలకంగా ఉన్న ఏస్‌నెక్స్ట్‌జెన్ సంస్థ ప్రతినిధులను ఏసీబీ ఇవాళ హైదరాబాద్‌లో విచారణ చేసింది. ఏస్‌నెక్స్ట్‌జెన్ సంస్థ డైరెక్టర్ అనిల్?ను దర్యాప్తు అధికారులు సుమారు రెండున్నర గంటల పాటు ప్రశ్నించారు. ఈ కేసులో ఏస్‌నెక్స్ట్‌జెన్ సంస్థనే రేసు నిర్వహించాల్సి ఉండగా కార్ రేస్?కు సంబంధించి అనుమతులు పొందేందుకు సమర్పించిన పత్రాలు, బ్యాంకు ఖాతాలకు సంబంధించి వివరాలు గురించి ఏసీబీ అధికారులు ప్రశ్నించారు.

డైరెక్టర్ అనిల్? ఏస్‌నెక్స్ట్‌జెన్ సంస్థలో మొదటి ప్రమోటర్?గా ఉన్నారు. 9వ సీజన్ రేసు నిర్వహణ అనంతరం ఈ సంస్థ 10వ సీజన్ నిర్వహించాల్సి ఉండగా ఒప్పందం నుంచి తప్పుకుంది. ఇలా ఒప్పందం నుంచి అర్థాంతరంగా వైదొలగడం వెనుక కారణాలపై ఏసీబీ లోతుగా ఆరా తీసింది. 9వ సీజన్ కోసం ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం గురించి పూర్తి వివరాలపై ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. ఈ కేసులో ఇప్పటికే ఏ1గా కేటీఆర్, ఏ2 అప్పటి మున్సిపల్ శాఖ కార్యదర్శి అర్వింద్ కుమార్, ఏ3 పూర్వ హెచ్?ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను విచారణ చేసింది.

2022 అక్టోబరు 25న జరిగిన మొదటి ఒప్పందం ప్రకారం సీజన్ 9, 10, 11, 12 రేస్‌ల నిర్వహణ ఖర్చులను ఏస్‌నెక్స్ట్‌జెన్ భరిస్తామని చెప్పింది. హైదరాబాద్‌లో 2023 ఫిబ్రవరి 10, 11 తేదీల్లో సీజన్-9 ఫార్ములా ఈ-రేస్ జరిగింది. అనంతరం 2024 ఫిబ్రవరిలో జరగాల్సిన సీజన్-10 రేస్ కోసం ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థకు 2023 మే లోనే 50 శాతం సొమ్ము (రూ.90 కోట్లు) చెల్లించాల్సి ఉండగా ఏస్‌నెక్స్ట్‌జెన్ కంపెనీ ముందుకు రాలేదు. సీజన్-9 ఫార్ములా ఈ-రేసు నిర్వాహణతో తమకు భారీగా నష్టం వాటిల్లిందంటూ ఏస్‌నెక్స్ట్‌జెన్ కంపెనీ చేతులెత్తేసింది.

దాంతో ప్రమోటర్‌గా హెచ్‌ఎండీఏనే (హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ) పోషించాలని అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో 2023 అక్టోబరు 5, 11 తేదీల్లో రూ.45.71 కోట్లను ఎఫ్ఈవోకు హెచ్ఎండీఏ నేరుగా బదిలీ చేసింది. ఈ వ్యవహారమే ఇప్పుడు ఈ మొత్తం వివాదానికి తెరలేపింది.

బాధ్యతల నుంచి అకస్మాత్తుగా తప్పుకొన్న ఏస్‌నెక్స్ట్‌జెన్ కంపెనీ మీద అప్పటి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. ఈ దిశగానే విచారణకు రావాలని ఈనెల 16న నోటీసులు జారీ చేశారు. విచారణకు తాము వస్తున్నట్లు ఏస్?నెక్స్ట్‌జెన్ డైరెక్టర్ అనిల్ ముందే సమాచారం ఇచ్చారు. అయితే ఫ్లైట్ ఆలస్యమైందని ఉదయం సమాచారం ఇచ్చారు. విమానం హైదరాబాద్ చేరుకున్నాక మధ్యాహ్నం 3 గంటల సమయంలో విచారణ ప్రారంభించారు.

# రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించనున్న నాలుగు సంక్షేమ పథకాల సర్వేను వేగవంతం చేయాలి

### అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్

భద్రాద్రి కొత్తగూడెం,18 జనవరి (క్రాంతిన్యూస్ ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు మరియు ఇందిరమ్మ ఇండ్ల సంక్షేమ పథకాల అమలులో భాగంగా చేపడుతున్న సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశానుసారం సంక్షేమ పథకాల అమలులో భాగంగా చేపడుతున్న సర్వే పురోగతిపై జిల్లాలోని తాసిల్దార్లు ఎంపీడీవోలతో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు గాను వ్యవసాయ యోగ్యమైన భూములకు పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ. 6000 చొప్పున రెండు విడతలుగా రూ. 12,000 భూ భారతి పోర్టల్ లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా చెల్లిస్తుందని, అలాగే ఇళ్లు (లేదా) కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు, రియల్ ఎస్టేట్ భూములు, లేఅవుట్ చేసిన భూములు, నాలా కన్వర్షన్ చేసిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, గోదాములు నిర్మించిన భూములు, వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములు, రాళ్ళు, రప్పలు, గుట్టలతో నిండి, సాగుకు అనువుగా లేని భూములను గుర్తించి, తొలగించాలని సూచించారు. రైతు భరోసా పథకం అమల్లోకి భాగంగా జిల్లా లోని 354 రెవెన్యూ గ్రామాలలో భూ సర్వే నిర్వహించి ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలన్నారు. 354 రెవెన్యూ గ్రామాలకు గాను ఇప్పటివరకు 194 రెవెన్యూ గ్రామాల సర్వే పూర్తి అయిందని మిగిలిన 160 రెవెన్యూ గ్రామాల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కొత్త రేషన్ కార్డు మంజూరు లో భాగంగా ఇంటింటి కుటుంబ సర్వే ఆధారంగా జిల్లాలో 29141 దరఖాస్తులు వచ్చాయని అదేవిధంగా రేషన్ కార్డులో కొత్త సభ్యులను జతపరచడానికి గాను 10796 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఈ దరఖాస్తులన్నింటిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశిత పట్టిక ద్వారా ప్రతిరోజు సాయంత్రం నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.



ప్రజా పాలన మరియు కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకుని జాబితాలో పేరు రాని అర్హుల వివరాలను కూడా నిర్దేశిత పట్టికలో నమోదు చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. లబ్ధిదారుల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

# కార్పొరేషన్ వద్దు.. పల్లె ప్రాంతాలే ముద్దు

### కొత్తగూడెం కార్పొరేషన్ ను ముక్తకంఠంతో వ్యతిరేకించండి

### ఏజెన్సీ ప్రాంతాలతో కార్పొరేషన్ ఏర్పాటు సరికాదు

భద్రాద్రికొత్తగూడెం,18జనవరి(క్రాంతిన్యూస్): కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటును సుజాతనగర్ మండల పరిధిలోని ఏడు గ్రామపంచాయతీల ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని గిరిజన జేఏసీ నాయకులు ఆ ప్రాంత ప్రజలను కోరారు. శనివారం సుజాతనగర్ మండల కేంద్రంలో జరిగిన కార్పొరేషన్ వ్యతిరేక పోరాట కమిటీ ప్రచారానికి చిట్టిరామవరం తండా జేఏసీ బృందంతో మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతు పల్లె ప్రాంతాలను కార్పొరేషన్లో కలిపితే ఉపాధి హామీ పథకాన్ని కోల్పోతారని చెప్పారు. తద్వారా ఉపాధి హామీ పథకంతో అనుసంధానమై ఉన్న ఎన్నో సబ్సిడీ పథకాలను కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. అంతేకాకుండా అధిక పన్నుల భారంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గతంలోనే రామవరం ఏజెన్సీ ప్రాంతాన్ని మున్సిపాలిటీలో కలపడం వల్ల ఏజెన్సీ చట్టాలు అమలు కాక హక్కులు, సంక్షేమ పథకాలు కోల్పోయామని పునరుద్ఘాటించారు. ముఖ్యంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, కేంద్ర ప్రభుత్వ చట్టాలు అమలు కాక ఇబ్బందులు పడ్డామని చెప్పారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా తమను కలిపి తమ ప్రాంతాన్ని అభివృద్ధి కాకుండా చేశారని మండిపడ్డారు. ఆ తప్పును సుజాతనగర్ పరిధిలోని ఏడు గ్రామ పంచాయతీల ప్రజలు చేయకూడదని సూచించారు. ముక్తకంఠంతో కార్పొరేషన్ ను వ్యతిరేకించి ఈనెల 20న జరిగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, జేఏసీ నాయకులు పూర్ణచందర్ నాయక్,రాజ్ కుమార్ నాయక్, మాజీ కౌన్సిలర్ గోబ్రియా నాయక్, , వీర్ల రమేష్, కోరబోయిన భాస్కర్ నాయక్,



సీతయ్య నాయక్,వాసు నాయక్,రమేష్ నాయక్,నాగేశ్వర రావు, బచ్చులకూర శ్రీను, చింతల శ్రీను, కున్సోత్ ధర్మ, కటారాల తిరుపతి, నర్రా శివరామకృష్ణ, కున్సోత్ షణ్ముఖ్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వాలి

### సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్ణపు సోమయ్య




మహబూబాబాద్ టౌన్,18 జనవరి (క్రాంతిన్యూస్ ):మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎన్ రవీందర్ గారికి వినతి పత్రం. ఈరోజు సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా పాలనలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు పెట్టుకున్న అర్హుల అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్ణపు సోమయ్య మాట్లాడుతూ గత టిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో పది సంవత్సరాలు అధికారంలో ఉన్న అర్హులైన పేదలకు రేషన్ కార్డులు ఇచ్చే దానిలో నిర్లక్ష్యం చేసింది. కాబట్టే గద్దె దింపారని అన్నారు. ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక సంక్షేమ పథకాలు ఇస్తామని హామీ ఇచ్చారు. వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజాపాలనను పటిష్టాత్మకంగా తీసుకొని అందులో దరఖాస్తులు తీసుకోవడం జరిగింది. ఆ దరఖాస్తులులో ఆప్షన్ లేకున్నా ఒక తెల్ల పేపరు మీద రాసుకుని దరఖాస్తు పెట్టుకున్న రేషన్ కార్డులు ఇస్తామని అధికారులు ప్రభుత్వం చెప్పడం జరిగింది. ఒక్కొక్క కుటుంబంలో ఇద్దరు ముగ్గురు పిల్లలు పెళ్లిళ్లు చేసుకుని వేరు కాపురము పెట్టుకొని జీవిస్తున్నారు. వీరికి రేషన్ కార్డులు లేక సంక్షేమ పథకాలు అందని ద్రాక్ష లాగా మారిందన్నారు. మహబూబాబాద్ పట్టణంలో ప్రతి వార్డులో 200 వరకు దరఖాస్తులు పెట్టుకున్నారు. కానీ ప్రతి వార్డుకు20 నుండి 30 వరకు ఎంపిక చేసినట్లు చెప్పుతున్నారు ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అమలు కావాలంటే రేషన్ కార్డు కీలకం కాబట్టి వెంటనే రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రేషన్ కార్డులు అర్హులైన అందరికీ అందాలంటే దరఖాస్తు గడువును పొడిగించాలని కోరారు. లేని వెడల పెద్ద ఎత్తున సిపిఎం పార్టీ ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి. పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్. వన్ టౌన్ కార్యదర్శి రావుల రాజు. పట్టణ కమిటీ సభ్యులు కుమ్మరి కుంట్ల నాగన్న. నక్క సైదులు. బానోతు వెంకన్న. తోట శ్రీనివాస్ .ఎర్ర శ్రీనివాస్. మందుల మహేందర్. బానోత్ ప్రకాష్. తోట యాకయ్య. తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టు నముండ్ల శ్రీనివాస్ ను ఓదార్చిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



రామగుండం,18 జనవరి (క్రాంతిన్యూస్ ):గోదావరిఖని ప్రాంతానికి చెందిన ప్రజాలక్ష్యం తెలుగు దినపత్రిక రిపోర్టర్ నముండ్ల శ్రీనివాస్ ను మాజీ రామగుండం ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బి ఆర్ఎస్ అధ్యక్షులు కోరుకంటి చందర్ శనివారం పరామర్శించారు. శ్రీనివాస్ తల్లి నముండ్ల రాజమ్మ అనారోగ్యంతో జనవరి 11న పరమపదించినారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చందర్ శ్రీనివాస్ స్వగ్రామం సుల్తానాబాద్ మండలంలోని అల్లిపూర్ (రేగడి మద్దికుంట) గ్రామంలోని అతని నివాసం లో కలిసి ఓదార్చారు.ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ శ్రీనివాస్ తల్లి రాజమ్మ ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని వేడుకుంటున్నానని అన్నారు. శ్రీనివాస్ తల్లి రాజమ్మ మరణించడం తీరని లోటు అని ఆయన అన్నారు.కాగా శ్రీనివాస్ తో పాటు అతడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు

## అబ్దుల్ కలాం సేవ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులుగా అంతర్గాం తహసిల్దార్ , తూమ్ రవీందర్ పటేల్ ఏకగ్రీవ ఎన్నిక - ట్రస్ట్ చైర్మన్ ఆంగోతు రవి నాయక్



రామగుండం ,18 జనవరి (క్రాంతిన్యూస్ ): పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం టి టి ఎస్ అంతర్గాం గ్రామంలో అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆధ్వర్యంలో నూతనంగా కమిటీ సభ్యుల సమక్షంలో ట్రస్టు గౌరవ అధ్యక్షులుగా అంతర్గాం తాసిల్దార్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు తూమ్ రవీందర్ పటేల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ట్రస్ట్ చైర్మన్ ఆంగోత్ రవి నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ రవి నాయక్ మాట్లాడుతూ ట్రస్ట్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షులుగా అంతర్గాం తాసిల్దార్ తూము రవీందర్ పటేల్ ను గౌరవ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నిక చేస్తూ, ఈ నూతన సంవత్సరంలో నూతనంగా మా సేవ ట్రస్ట్ మండలంలోని నిరుపేద కుటుంబంలోని మహిళల పెళ్లిళ్లకు పుస్తె మట్టెలు, చనిపోయిన వ్యక్తి కుటుంబానికి25 కిలోల బియ్యం బ్యాగు ఇస్తున్నామని గత కొద్ది సంవత్సరాల నుండి మా ట్రస్టు యువకులు చెడు అలవాట్లకు లోను కాకుండా క్రీడ పోటీలు నిర్వహిస్తూ, పాఠశాలలోని విద్యార్థులకు స్పోర్ట్స్ కు సంబంధించి షూస్, టీషర్ట్స్, క్రీడా సామాగ్రి కూడా అందిస్తున్నామని. అలాగే రాబోయే కాలంలో మా సేవా ట్రస్టు మరెన్నో నూతన కార్యకలాపాలను చేపట్టబోతుందని దానికి మండలంలోని యువకులు, ప్రభుత్వ అధికారులు, మద్దతు తెలుపుతూ మా సేవ ట్రస్ట్ కు ప్రతి ఒక్కరు కూడా అందుబాటులో ఉంటూ వారి సేవలను అందించాలని, మొదటగా మా సేవా ట్రస్ట్ లోని కమిటీ సభ్యులు మా ట్రస్టు ముందుకెళ్లడానికి వారి వంతుగా వారికి తోచిన విధంగా ఎంతో సహాయ, సహకారాలు అందిస్తున్నారని కావున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ట్రస్ట్ చైర్మన్ ఆంగోత్ రవి నాయక్ తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చినటువంటి అంతర్గాం తాసిల్దార్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు తూము రవీందర్ పటేల్ మాట్లాడుతూ ఇంత మంచి ఆలోచనతో ట్రస్ట్ పెట్టి ఎంతోమంది యువకులకు, పేదలకు సేవా కార్యక్రమాలు చేస్తున్నటువంటి ట్రస్ట్ సభ్యులకు ప్రతి ఒక్కరికి నా వంతు ధన్యవాదాలు తెలుపుతున్నానని, అలాగే తనవంతుగా ట్రస్ట్ కు ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికి అయినా ముందుంటానని అంతర్గాం తాసిల్దార్, తెలంగాణ గెజిటెడ్ సంఘం అధికారుల జిల్లా అధ్యక్షులు తూము రవీందర్ పటేల్ తెలిపారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు గౌరవ అధ్యక్షులుగా ఎన్నికైన తూము రవీందర్ పటేల్ ను శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో అంతర్గాం తాసిల్దార్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు తూము రవీందర్ పటేల్, ట్రస్ట్ చైర్మన్ ఆంగోత్ రవి నాయక్ , ఉపాధ్యక్షులు సాయి కిరణ్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల శ్రీకాంత్, క్యాషియర్ అప్పాల శ్రీకాంత్,ఆర్గనైజర్ కోల ప్రణీత్ గౌడ్, మాడ శ్రీకాంత్ రెడ్డి, మాడ అనిల్ రెడ్డి, సాయి, మండల నాయకులు మాడ నారాయణరెడ్డి, ఆంగోత్ శ్రీనివాస్, యువకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పీవీకే 5 లో కార్మిక సమస్యలను పరిష్కరించాలి

### ఐ ఎన్ టీ యు సి వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్.

భద్రాద్రికొత్తగూడెం,18జనవరి (క్రాంతిన్యూస్):పీవీకే 5లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం పై కేజీఎం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ గని మేనేజర్ శ్యాం ప్రసాద్ ను శనివారం కలసి చర్చించారు. గని మేనేజర్ ను కలిసే ముందు కార్మికుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా విధుల్లో చేరిన మహిళా ఉద్యోగులకు అన్ని సౌకర్యాలు కలిగిన రెస్ట్ రూమ్స్ ఏర్పాటు చేయాలనీ,మైన్ ఆవరణలో ఇంటర్నల్ రోడ్స్ వేయించాలని, బైక్ ల కు, కార్ లకు పార్కింగ్ షెడ్స్ నిర్మించాలని,కొత్తగా ఏర్పాటు చేసిన 5బి బోర్ హోల్ పంప్ ల వద్ద వర్కర్లకు రెస్ట్ షెల్టర్ నిర్మించాలని, తదితర సమస్యలపై గని మేనేజర్ తో చర్చించారు . పైన పేర్కొన్న సమస్యలు పురోగతి స్థాయిలో ఉన్నవని త్వరలో అన్ని సమస్యలు పరిస్కారం అవుతాయని గని మేనేజర్ హామీ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమం లో పిట్ సెక్రెటరీ చిలక రాజయ్య సకినాల సమ్మయ్య,బాలు, సంబమూర్తి,బోరింగ్ శంకర్,రామ్మోహన్ రావు, సీతారాం, శ్రీనివాస్,వై. శంకర్, కె. రాజేష్,తదితరులు పాల్గొన్నారు.



# ఏపీని ఊరిస్తున్న అద్భుత అవకాశం!..

## మరో మూడు రాష్ట్రాలతో పోటీ?




అమరావతి,18 జనవరి(క్రాంతిన్యూస్ ):

ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్‌లోకి పలు కీలక ప్రాజెక్టులు వస్తున్నాయి. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఈ క్రమంలోనే మరో అంతర్జాతీయ సంస్థ చూపు ఏపీ వైపు పడినట్లుగా జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఫ్రాన్స్‌కు చెందిన ఎయిర్?బస్ సంస్థ మనదేశంలో హెచ్125 హెలికాప్టర్ల ఫైనల్ అసెంబ్లీ లైన్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ భాగస్వామ్యంతో కలిసి ఎయిర్ బస్ సంస్థ హెచ్125 హెలికాప్టర్ల ఫైనల్ అసెంబ్లీ లైన్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రచిస్తోంది. అయితే ఈ ప్లాంట్ కోసం మనదేశంలో నాలుగు ప్రాంతాలను ఎయిర్‌బస్ ఎంపిక చేసినట్లు సమాచారం.

హెచ్ 125 హెలికాప్టర్ల ఫైనల్ అసెంబ్లీ లైన్ ప్లాంట్ ఏర్పాటు కోసం భారతదేశంలోని నాలుగు రాష్ట్రాలను ఎయిర్‌బస్ ఎంపిక చేసినట్లు పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలతో పాటుగా గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లను ఫైనల్ అసెస్‌మెంట్ కోసం ఎంపిక చేసినట్లు సమాచారం. మరోవైపు భారత దేశంలో తొలి H125 హెలికాప్టర్‌ను వచ్చే ఏడాది కల్లా విడుదల చేయాలని ఎయిర్‌బస్, టీఏఎస్‌ఎల్ లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్ ఎక్కడ అసెంబుల్ చేస్తారనే దానిపై త్వరలోనే అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి.

మరోవైపు ఉద్యోగులను ఆ ప్రాంతం ఆకర్షిస్తుందా.. పారిశ్రామిక కార్యకలాపాలకు ఎంత మేరకు అనువుగా ఉంటుంది.. లాజిస్టిక్ ఎకో సిస్టమ్ ఎలా ఉంది ఇలాంటి అనే ప్రామాణికాల ఆధారంగా ఎయిర్ బస్ ప్లాంట్ కోసం స్థలాన్ని ఎంపిక చేయనున్నట్లు సమాచారం. ఎయిర్‌బస్ కనుక మన దేశంలో ఫైనల్ అసెంబ్లీ లైన్ ఏర్పాటు చేసి ఉత్పత్తి చేస్తే.. మనదేశంలో ప్రైవేట్ రంగంలో తయారైన మొదటి పౌర హెలికాప్టర్‌గా అక్కడి నుంచే అందుబాటులోకి వస్తుంది.

అలాగే ఈ ప్లాంట్ ద్వారా తొలుత ఏడాదికి పది హెచ్ 125 హెలికాప్టర్లను ఉత్పత్తి చేయాలని భావిస్తున్నారు. ఆ తర్వాత డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తిని పెంచనున్నారు. భారతదేశంతో పాటుగా దక్షిణ ఆసియాలో వచ్చే 20 ఏళ్లలో 500 లైట్ హెలికాప్టర్ల అవసరం ఏర్పడుతుందని ఎయిర్‌బస్ అంచనా వేస్తోంది. ఈ క్రమంలోనే భారతదేశంలో ప్లాంట్ కోసం ఆలోచనలు చేస్తోంది. 2024 జనవరిలో ప్రధానమంత్ర నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ చర్చల సందర్భంగా ఈ ప్రాజెక్టును ప్రకటించారు.

# తిరుమల కొండపై ఎగ్ పులావ్.. భక్తుల ఆగ్రహం



తిరుమల ,18 జనవరి ( క్రాంతి న్యూస్ ): తిరుమలలో అపచారం జరిగింది. శ్రీవారి దర్శనానికి వచ్చిన కొంతమంది భక్తులు ఏకంగా కొండపైకి పెద్ద గిన్నె నిండుగా ఎగ్ పులావ్ తీసుకొని వచ్చారు. రాంభగీచ బస్టాండ్ సమీపంలో వారు గుడ్లు తినడం చూసిన ఇతర భక్తులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో ఈ విషయం అందరికీ తెలిసింది. దీనిపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తమిళనాడుకు చెందిన కొందరు భక్తులు ఓ డబ్బా నిండా కోడి గుడ్లు, పులావ్ తీసుకుని తిరుపతికి వచ్చారు. అలిపిరి నుంచి తిరుమల కొండపైకి చేరుకున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో సెక్యూరిటీ తనిఖీని దాటుకుని వాళ్లు ఎగ్ పులావ్‌ను రాంభగీచ బస్టాండ్ వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ఓ పక్కన కూర్చొని కోడిగుడ్లు, పులావ్ తింటుండటం గమనించిన ఇతర భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భక్తుల ఫిర్యాదుతో హుటాహుటిన అక్కడకు చేరుకున్న పోలీసులు ఆహారాన్ని సీజ్ చేశారు. తిరుమలలో మాంసాహారం నిషిద్ధం అని వారికి తెలిపారు. అయితే తమకు ఆ విషయం తెలియదని తమిళనాడు భక్తులు చెప్పడంతో.. పోలీసులు మందలించి వదిలేశారు.అయితే, తిరుమలపైకి వచ్చేప్పుడు ఉండే పకడ్బందీ సెక్యూరిటీ తనిఖీని దాటుకుని భక్తులు కోడిగుడ్లను కొండపైకి తీసుకురావడం ఇప్పుడు కలకలం రేపుతుంది. దీంతో తిరుమలలో భద్రతలో డొల్లతనంపై పలు అనుమానాలు వస్తున్నాయి.

# 30 ఏళ్లుగా ఏ కార్యక్రమమైనా అక్కడి నుంచే స్టార్ట్..

## కానీ ఆ ఒక్కటీ మాత్రం.. ఎట్టకేలకు తీరింది!




కృష్ణాజిల్లా,18జనవరి(క్రాంతిన్యూస్):

కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండలంలోని మారేడుమాక గ్రామ ప్రజల నిరీక్షణ ఫలించింది. ఈ ఊరి జనాల 30 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. మారేడుమాక గ్రామం ఈశాన్యం దిక్కులో ఉంటుంది. దీంతో ఇక్కడ ఏదైనా కార్యక్రమం తలపడితే శుభప్రదమవుతుందని స్థానికులు, ఈ నియోజకవర్గ ప్రజల నమ్మకం. దీంతో రాజకీయ నేతల నుంచి అధికార యంత్రాంగం వరకూ ఈ నియోజకవర్గ పరిధిలో చేపట్టే ఏ కార్యక్రమాన్నైనా ఇక్కడి నుంచే మొదలుపెడతారు. ఎన్నికల ప్రచారం మొదలుకుని, ప్రభుత్వ కార్యక్రమాల వరకూ ఏ పని అయినా ఇక్కడి నుంచే మొదలు. గత 30 ఏళ్లుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. అయితే ఈ 30 ఏళ్లుగా ఈ ఊరిజనం కూడా అధికారులను ఓ కోరిక కోరుతూ వచ్చారు.

ఎన్నికలు జరిగిన ప్రతి సారీ తమ ఊరికి ఆర్టీసీ బస్సు వేయాలని ప్రజాప్రతినిధులను కోరుతూ వచ్చారు. అయితే వివిధ కారణాలతో ఈ దిశగా అడుగులు పడలేదు. మారేడుమాక రహదారి బాగా లేకపోవటంతో పాటుగా ఊరి నుంచి ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండడంతో గ్రామ ప్రజల డిమాండ్‌ను ఆర్టీసీ అధికారులు పట్టించుకోలేదు. దీంతో తమ ఊరికి బస్సు కావాలన్న ఆ ఊరి జనం కల.. 30 ఏళ్లుగా అలా అపరిష్కృతంగానే ఉంటూ వచ్చింది. అయితే తాజాగా మారేడుమాక గ్రామ రహదారిని అధికారులు బాగు చేశారు. రహదారికి మరమ్మత్తులు చేపట్టారు. దీంతో రోడ్డు బాగుపడటంతో మారేడుమాక ఊరి జనం మరోసారి తమ వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ద్వారా మారేడుమాక ప్రజలు వినతిపత్రం సమర్పించారు. ఈ వినతిపై స్పందించిన ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు మారేడుమాక గ్రామానికి బస్సును ఏర్పాటు చేశారు. తెన్నేరు–కాళేశ్వరరావు మార్కెట్ బస్సు సర్వీసును మారేడుమాక వరకు పొడిగించారు. రోజుకు మూడు రౌండ్లు తిరిగేలా ఏర్పాటు చేశారు. శుక్రవారం బస్సు ఊర్లోకి రావటంతో మారేడుమాక గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులకు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఊర్లోకి బస్సు సౌకర్యం ఏర్పాటు కావటంతో విద్యార్థులు, వ్యాపారులు, స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

### ఆర్టీసీ బస్సులోనే హఠాన్మరణం

మరోవైపు మచిలీపట్నం డిపోలో.. ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు హఠాన్మరణం చెందాడు. మృతుడు గూడూరు మండలం పిండివారిపాలెనికి చెందిన సిరివెళ్ల వెంకటేశ్వరరావుగా గుర్తించారు. 60 ఏళ్ల వెంకటేశ్వరరావు ఏడాది కింద బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. డాక్టర్ చెకప్ కోసం విజయవాడ వెళ్లేందుకు మచిలీపట్నం డిపోలో బస్సు ఎక్కారు. అయితే బస్సు బయలుదేరక ముందే సీటులోనే వెంకటేశ్వరరావు ఓ పక్కకు ఒరిగిపోయారు. బస్సులోనే ఉన్న ఓ డాక్టర్ కాపాడే ప్రయత్నం చేసినా.. ఫలించలేదు.

# తిరుమలలో చాగంటికి అవమానం జరిగిందా?

### చాగంటి అభిమానుల ఆగ్రహం

## అసలేం జరిగింది? టీటీడీ స్పందన ఏంటి?

తిరుమల ,18 జనవరి ( క్రాంతి న్యూస్ ):

ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త 'బ్రహ్మర్షి డాక్టర్ చాగంటి కోటేశ్వర రావు'కు తిరుమలలో అవమానం జరిగిదంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. డయల్ న్యూస్ అనే ఓ యూట్యూబ్ ఛానెల్‌లో 'తిరుమలలో చాగంటికి అవమానం' అంటూ ఓ వీడియోను పోస్టు చేశారు. ఈ వీడియో కింద కామెంట్ సెక్షన్‌లో కొంత మంది అభిమానులు తీవ్రంగా స్పందించారు. 'ఒక్క గురువు గారిని అవమానించడం అంటే కోట్లాది భక్తుల నమ్మకాన్ని అవమానించినట్లే. టీటీడీలో అన్యమతస్థులను పోషిస్తున్నారు', 'నాశనం అయిపోతారు. పోగాలం దాపురించింది వెధవలకి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకీ చాగంటి కోటేశ్వరరావు తిరుమల పర్యటన సందర్భంగా ఏం జరిగింది?



### క్లెయిమ్ ఏంటి?

తిరుమలలో ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకు అవమానం. ఆయణ్ని బయోమెట్రిక్ ద్వారా నేరుగా తిరుమల ఆలయంలోనికి తీసుకెళ్లాల్సి ఉండగా సాధారణ భక్తుడి మాదిరిగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా పంపించిన టీటీడీ అధికారులు. తిరుపతిలో ఏర్పాటుచేసిన చాగంటి ప్రవచనాల కార్యక్రమం కూడా రద్దు చేసిన టీటీడీ. – Dial News అనే యూట్యూబ్ ఛానెల్‌లో జనవరి 15న బ్రేకింగ్ న్యూస్ తరహాలో ఈ వార్త క్లిప్‌ను పోస్టు చేశారు.

ఇక ఇదే వీడియో లింకును తీసుకొని ఎక్స్ (ట్విట్టర్)లోనూ కొంత మంది యూజర్లు పోస్టు చేశారు. 'చాగంటి కోటేశ్వరరావుకు TTD లో ఘోర అవమానం. క్యాబినెట్ హోదాలో కూటమి ప్రభుత్వం ఆయనను సలహాదారుగా నియమించింది. తిరుమలలో ఇలాంటివి కామన్ అయిపోయాయి' అంటూ @ Kumar 991957 అనే ఖాతా నుంచి పోస్టు చేశారు. సనాతన పరిరక్షకుడినని చెప్పుకునే పవన్ కళ్యాణ్.. జరిగిన ఘటనపై వెంటనే విచారణకు ఆదేశించి, చాగంటికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

iamchaythu అనే మరో యూజర్ ఇలా పోస్టు చేశారు – 'ఏదో బయోమెట్రిక్ ఫెయిల్ అనే కారణంతో, ఆయనకు ఆరోగ్యం బాలేదు అని అంటున్న కూడా వైకుంఠం Q కాంప్లెక్స్ నుంచి దర్శనం కల్పించారు అని అంటున్నారు చాగంటి గారిని. రేపు మహతిలో ప్రవచనాల ఉన్నాయి. ఆ పని కోసం వచ్చారు. అది కూడా రద్దు చేసింది టీటీడీ'

### వాస్తవం ఏంటి?

ఈ వార్తలపై నిజానిజాలు తెలుసుకునే క్రమంలో.. మేం (సజగ్ టీమ్) 'చాగంటి కోటేశ్వరరావు తిరుమల సందర్శన'పై ఇంటర్నెట్‌లో సెర్చ్ చేయగా.. జనవరి 14న ఆయన సతీసమేతంగా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ సందర్శనకు వచ్చినట్లు పలు వార్తా కథనాలు, సోషల్ మీడియా పోస్టులు, యూట్యూబ్ వీడియో లింకులు కనిపించాయి. మరింత లోతుగా పరిశీలిస్తూ వెళ్లగా.. టీటీడీ పోస్టు లభించింది.

చాగంటికి అవమానం జరిగిందన్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని తిరుపతి తిరుమల దేవస్థానం స్పష్టం చేసింది. టీటీడీపై ఇలాంటి అసత్యాలు ప్రచారం చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. చాగంటి పర్యటన సందర్భంగా వాస్తవానికి అక్కడ ఏం జరిగిందో వివరణ ఇస్తూ ఒక సమగ్ర ప్రకటనను విడుదల చేసింది.

ప్రవచనకర్త బ్రహ్మర్షి శ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వర రావు ప్రతి ఏడాది జనవరిలో తిరుమల వచ్చి శ్రీవారిని సందర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని టీటీడీ తెలిపింది. ఈ క్రమంలో జనవరి 14న శ్రీవారి దర్శనం, జనవరి 16న సాయంత్రం తిరుపతి మహతి ఆడిటోరియంలో ప్రవచనాలు ఇచ్చేందుకు 2024 డిసెంబర్ 20న టీటీడీ ప్రొసీడింగ్స్ ఇచ్చిందని వెల్లడించింది. డాక్టర్ చాగంటి కోటేశ్వర రావుకి ఉన్న కేబినేట్ ర్యాంక్ ప్రోటోకాల్ ప్రివిలేజ్ ప్రకారమే జనవరి 14న శ్రీవారి దర్శనం ఏర్పాట్లను చేసినట్లు తెలిపింది. అయితే, ఈ వీఐపీ దర్శన ఏర్పాట్లను చాగంటి కోటేశ్వరరావు తిరస్కరించినట్లు తెలిపింది.

'ఏర్పాట్లలో భాగంగా రాంబగీఛ గెస్ట్ హౌస్ నుంచి శ్రీవారి ఆలయానికి చాగంటిని తీసుకెల్లేందుకు బగ్గీస్‌ను, శ్రీవారి ఆలయానికి బయోమెట్రిక్ ద్వారా అనుమతించేందుకు టీటీడీ ఏర్పాట్లను చేసింది. అయితే, వయసు రీత్యా శ్రీవారి ఆలయానికి బయోమెట్రిక్ ద్వారా వెళ్లే సదుపాయం ఉన్నా వారు (చాగంటి) సున్నితంగా తిరస్కరించారు. పలువురు ప్రముఖులు, సాధారణ భక్తుల తరహాలోనే వైకుంఠం కాంప్లెక్స్ నుంచి శ్రీవారి ఆలయానికి చేరాలని వారే స్వయంగా సూచించారు. వారి సూచనల మేరకు వారే స్వయంగా వైకుంఠం కాంప్లెక్స్ నుంచి ఆలయానికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు' అని టీటీడీ ప్రకటనలో పేర్కొన్నారు.

అదేవిధంగా జనవరి 8న తిరుపతిలో జరిగిన తోపులాట ఘటన నేపథ్యంలో చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమాన్ని మరొక తేదీకి వాయిదా వేస్తే బాగుంటుందని భావించి, టీటీడీ అధికారులు ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారని.. ఈ విన్నపాన్ని చాగంటి అంగీకరించారని తెలిపారు. చాగంటి వారి అపాయింట్మెంట్ తేదీలను మరోసారి తీసుకుని ప్రవచనాలను ఏర్పాటు చేసేందుకు టీటీడీ నిర్ణయించిందని ప్రకటనలో పేర్కొన్నారు.

'వాస్తవం ఇలా ఉండగా బయోమెట్రిక్ ద్వారా కాకుండా వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి శ్రీవారి ఆలయంలోకి అనుమతించారని, చివరి నిమిషంలో పరిపాలనా కారణాల రీత్యా చాగంటి వారి ప్రవచనాల కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు టీటీడీని పలుచన చేసేలా వాస్తవాలను వక్రీకరించి అసత్యపు వార్తను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ ఆ ప్రకటనలో హెచ్చరించింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సైతం ఈ ప్రకటనను పోస్టు చేశారు.

### చాగంటి గురించి ముఖ్యమైన విషయాలు

ప్రవచనల ద్వారా ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించారు బ్రహ్మర్షి డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు. ఆయన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మేనేజర్‌గా ఉన్నతోద్యోగం చేశారు. శని, ఆదివారాల్లో మాత్రమే ప్రవచనాలు చెబుతారు. ప్రధానంగా కాకినాడలోని ఒక ఆలయంలో ఆయన ప్రవచనాలను చెబుతూ వస్తున్నారు. ప్రవచనాలు చెప్పినందుకు చాగంటి డబ్బులు తీసుకోరు. కాకినాడ కాకుండా ఎక్కడికైనా ఇతర నగరాలకు వెళ్లి ప్రవచనాలు చెప్పాల్సి వస్తే.. తన సొంత డబ్బులతోనే ప్రయాణం చేస్తారు. నిర్వాహకుల నుంచి ఎలాంటి డబ్బు తీసుకోరు.

చాగంటి కుమారుడు, కోడలు, కుమార్తె, అల్లుడు కూడా ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చాగంటికి ప్రభుత్వ సలహాదారు పదవిని ఇచ్చి గౌరవించింది. చాగంటికి 'స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్ సలహాదారుడి'గా బాధ్యతలు అప్పగించింది. కేబినెట్ హోదా కల్పించింది.

### ముగింపు:

తిరుమలలో చాగంటికి అవమానం అంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవం. టీటీడీ ప్రత్యేక ప్రవేశ దర్శన ఏర్పాట్లను చాగంటి కోటేశ్వరరావు స్వయంగా తిరస్కరించి, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా దర్శనానికి వెళ్లారు. ఇక తొక్కిసలాట ఘటన నేపథ్యంలో తిరుమలలో చాగంటి ప్రవచనాల కార్యక్రమాన్ని, ఆయన అనుమతితో వాయిదా వేసినట్లు టీటీడీ ప్రకటించింది.

# రేషన్ కార్డుల పరిశీలన జాబితా ఒక గందరగోళం

**రేషన్ కార్డుల పరిశీలన జాబితాలో చాలామంది పేర్లు గల్లంతు**

**రేషన్ కార్డుల పరిశీలన జాబితాలో పేర్లు రానట్టు వంటి వారికి అవకాశం కల్పించి అర్హుల జాబితాను ప్రకటించాలి**

**మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు డిమాండ్**

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,18 జనవరి (క్రాంతిన్యూస్ ):కొత్తగూడెం (అర్బన్): దరఖాస్తు చేసుకున్న చాలామంది లబ్ధిదారుల పేర్లు జాబితాలో లేకపోవడం రేషన్ కార్డు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పదో వార్డులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రేషన్ కార్డుల లబ్ధిదారుల పరిశీలన జాబితాను దేని ఆధారంగా తయారు చేశారో అర్థం కాని అయోమయ స్థితిలో ఆ జాబితా ఉన్నదని ఆయన అన్నారు. అనేకమంది రేషన్ కార్డుల కోసం ఆన్లైన్లోను, కలెక్టర్ ఆఫీస్ లో, తాసిల్దార్ ఆఫీసుల్లో, ప్రజా పాలనలో దరఖాస్తు చేశారని వీటిలో చాలామంది పేర్లు ఈ జాబితాలో లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. గత అనేక సంవత్సరాల నుండి ఒక్క రేషన్ కార్డు కూడా జారీ కాలేదని, ఇప్పుడైనా రేషన్ కార్డులు వస్తాయని సంతోషించిన ప్రజలకు ఈ జాబితాను చూడటంతో ఇప్పుడు కూడా రేషన్ కార్డులు రాకపోతే ఇక రేషన్ కార్డు రావడం కష్టమేనని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. కుటుంబ సభ్యుల పేర్లు, చిన్న పిల్లల పేర్లు, పెళ్లయి వచ్చిన కోడల పేర్లు చేర్చుకునేందుకు అవకాశం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు. అలాగే కుటుంబ సర్వే కులగననలో రేషన్ కార్డు లేదని సర్వేలో రాయించుకున్న వారి పేర్లు కూడా అనేకమందివి రాలేదని దీన్ని బట్టి చూస్తే ఏ ఆధారంగా లబ్ధిదారుల పరిశీలన జాబితా తయారు చేశారో అర్థం కావడం లేదని ఆయన అన్నారు. ఇట్టి సమస్యలను కౌన్సిలర్స్ ద్వారా తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావు పెన్షన్ పైనే ఆధారపడి జీవిస్తున్న సింగరేణి రిటైర్మెంట్ కార్మికులకు పెన్షన్ నిబంధనను సడలించి వారికి నూతన కార్డులు మంజూరు చేయాలని, అలాగే ఎవరి పేర్లు అయితే జాబితాలో రాలేదొ అర్హత కలిగిన వారి నుండి



నూతన దరఖాస్తులు తీసుకొని వారికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించినట్లు మునిగడప తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకురాలు ముద్దం మార్తమ్మ, బి జాన్ బి ,శకుంతల, ముంతాజ్, నూరి, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# విమల్ సీడ్స్ వారి మిర్చి ప్రదర్శన క్షేత్రంలో నాగుర్ల...!

**రైతులు నాణ్యమైన మిర్చి విత్తనాలను ఎంచుకోవాలి..**

**మారుతున్న వాతావరణానికి అనుకూలంగా సీడ్స్ వేసుకోవాలి..**

**వైరస్ తెగుళ్ళ ను తట్టుకునే సీడ్స్ ను ఎంచుకోవాలి...**

**రైతు రుణ విముక్తి కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు.**




చిట్యాల,18 జనవరి (క్రాంతిన్యూస్ ):రైతులు నాణ్యమైన మిర్చి విత్తనాలను వాడినట్లయితే అధిక దిగుబడి సాధించవచ్చని, మారుతున్న వాతావరణానికి అనుకూలంగా అధిక వైరస్ వంటి తెగుళ్లను తట్టుకొని నిలబడే మిర్చి విత్తనాలను రైతులు సాగు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విముక్తి కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. విమల్ సీడ్స్ వారి అది త్రీ 2277 అనే నూతన మిర్చి వంగడాన్ని భూపాలపల్లి జిల్లా, చిట్యాల మండలం, జూకల్ గ్రామానికి చెందిన గుర్రం మహేందర్ తన వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్నారు. మిర్చి పంట అధిక పూత,అధిక ఖాతా కాయడంతో ఆ వ్యవసాయ క్షేత్రాన్ని తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విముక్తి కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుకూలంగా మిర్చి వంగడాలను ఎంచుకోవాలని, కొత్త సాంకేతికతతో తయారయ్యేటు వంటి విమల్ సీడ్స్ వారి అధిత్రి 2277 అనే వంగడం పరకాలలోని పరమేశ్వర ఆగ్రోస్ ఏజెన్సీ ద్వారా విక్రయించి రైతు పెట్టడం జరిగిందని అన్నారు. ఈ మిర్చి పంట బాగా పూత, ఖాతా, కాసిందని అన్నారు. ప్రస్తుతం మిర్చి పంటలో వచ్చేటువంటి తెగుళ్లను తట్టుకొని పెద్ద మొత్తంలో చెట్లకు అధిక మిరపకాయలు పడ్డాయని అధిక దిగుబడి సాధించవచ్చని,రైతుకు అధిక దిగుబడి వస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మిర్చి పంట, ఇతర పంటలు వేసేటువంటి రైతులు కూడా నూతన సాంకేతికతతో వచ్చేటువంటి వంగడాల వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి బాగా దిగుబడి వచ్చే విధంగా ఉన్నట్లయితేనే అటువంటి నూతన రకాలను కొనుగోలు చేసి వేసుకోవాలని అన్నారు. చుట్టుప్రక్కల నుండి వచ్చినటు వంటి సుమారు 400 మంది రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విమల్ సీడ్స్ మేనేజర్ అమ్మి రెడ్డి రాజు, విమల్ సీడ్స్ డిస్ట్రిబ్యూటర్ మరియు పరమేశ్వర ఆగ్రో సీజన్సీస్ దేవ సతీష్, డిస్ట్రిబ్యూటర్ దేవ సందీప్, విమల్ సీడ్స్ ఎండిఓ లు కొడారి రాజు, నాగుర్ల విక్రమ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# దశదినకర్మ కార్యం లో పాల్గొని సంఘీభావం తెలిపిన బిఆర్ఎస్ నాయకులు



హసన్‌పర్తి,18జనవరి (క్రాంతిన్యూస్): హసన్ పర్తి మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన దూలం సరోజన దశదినకర్మ కార్యక్రమంలో బిఆర్ఎస్ హసన్ పర్తి మండల పార్టీ అధ్యక్షులు డాక్టర్. బండి రజనీ కుమార్, టిఆర్ఎస్ నాయకులు బూరుగుపల్లి విజయ్ కుమార్, గడ్డం సుమన్, దొంతి సుధాకర్ రెడ్డి, అంబాల రమేష్, సోషల్ మీడియా టిఆర్ఎస్ పార్టీ నాయకుల దూలం పవన్ తదితరులు పాల్గొని ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.

# మత్తు పదార్థాల నిర్మూలనకై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని సమాజానికి తోడ్పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది,అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్.



వికారాబాద్,18 జనవరి (క్రాంతిన్యూస్ ): శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్సు హాల్ నందు ఎక్సైజ్, విద్యాశాఖ, జిల్లా సంక్షేమ సంక్షేమ, వ్యవసాయ, పోలీస్ వివిధ శాఖల అధికారులతో మాదకద్రవ్య నిర్మూలనపై సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా విద్యాసంస్థల్లో, వసతి గృహాల్లో మాదక ద్రవ్యాల వాడకం వల్ల జరిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. గ్రామాలలో పర్యటించే క్రమంలో మహిళా స్వయం సంఘాలు, అంగన్వాడి టీచర్లు, స్వచ్ఛంద సంస్థలు మాదకద్రవ్యాల వాడకం వల్ల జరిగే నష్టాలపై అవగాహన చేపట్టాలని ఆయన సూచించారు. మత్తు పదార్థాల నివారణలో భాగంగా వ్యవసాయ పొలాల్లో గంజాయి పండించడంపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. నిర్వహించారు. జిల్లాలో పూర్తిగా మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు సాగుతూ వెళ్లాలని ఆయన తెలిపారు . ముఖ్యంగా రైలు, రోడ్డు మార్గాలలో గంజాయి విక్రయదారులు వచ్చే అవకాశం ఉన్నందున వాటిని అడ్డుకు కునేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తూ అడ్డుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశం లో అదనపు ఎస్పీ హనుమంత్ రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి , డిఇఓ రేణుకా దేవి, డిఎంహెచ్ఓ వెంకటరమణ, డి సి హెచ్ ఓ ప్రదీప్, డివైఎస్ఓ హనుమంతరావు, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శంకర్ నాయక్,అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ శ్యాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమంగా ఇసుక, ఎర్రమట్టి రవాణా చేస్తున్న వారిపైన జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారుల దాడులు. జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్.

వికారాబాద్,18 జనవరి (క్రాంతిన్యూస్ ): టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఆంజనేయులు,ఎస్ ఐ ప్రశాంత్ వర్ధన్ మరియు టీం అధికారులు జిల్లాలో అక్రమంగా ఇసుక, ఎర్రమట్టి రవాణా చేస్తున్నా 8 మందిని అదుపులోకి తీసుకోని మూడు ఇసుక



ట్రాక్టర్లు, ఎర్రమట్టి తరలిస్తున్నా మూడు టిప్పర్ లు, ఒక జేసీబీ, ఒక కార్ మరియు 4 సెల్ ఫోన్ లు స్వాధీనం చేసుకొని వారిపైన ఆయా పోలీస్ స్టేషన్స్ పరిధిలలో కేసులు నమోదు చేయడం జరిగింది అని జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి తెలియజేయడం జరిగింది. వివరాల్లోకి వెళితే వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధన్నారం గుట్ట నుండి ఎర్రమట్టిని తరలిస్తున్నా 5గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోని మూడు ఎర్రమట్టి లోడ్ చేసిన టిప్పర్ వాహనాలు, ఒక జేసీబీ, ఒక కార్, 4 సెల్ ఫోన్లు వారి నుండి స్వాధీనం చేసుకొని వారిపైన వికారాబాద్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయడం జరిగింది. తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ట్రాక్టర్ మరియు యాలాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ట్రాక్టర్ లు అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకొని






ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోని వారిపైన ఆయా పోలీస్ స్టేషన్స్ పరిధిలలో కేసు నమోదు చేయించడం జరిగిందని జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి తెలియజేయడం జరిగింది. జిల్లా లో పిడిఎస్ బియ్యం, ఇసుక, ఎర్రమట్టి, మోరం అక్రమ రావణాలు చేసిన, చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇట్టి కార్యకలాపాలకు పాల్పడిన, ప్రోత్సహించిన ఎంతటి వారు అయిన ఉపేక్షించేది లేదని,జిల్లాలో ఎవరైనా చట్ట వ్యతిరేక , అసాంఘిక కార్యకలాపాలు పాల్పడిన, అక్రమంగా రావణాలు జరిపిన జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారి ఆంజనేయులు సెల్ నెంబర్ 8712670022 ద్వారా సమాచారం అందించాలని ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపినారు.

# ఆరోగ్య క్రాంతి




## అల్లంతో రక్తపోటు అదుపులో ఉంటుందా?



హెల్త్ న్యూస్,18 జనవరి (క్రాంతిన్యూస్ ): చలికాలంలో మన జీవనశైలిలో మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే శరీరంలో అనేక రకాల సమస్యలు తలెత్తి పెరిగే ప్రమాదం ఉంది. అయితే, చలికాలంలో అనేక ఆహార పదార్థాలు అందుబాటులో ఉన్నాయి. ఇవి ఈ సమస్యలను తగ్గించగలవు. శీతాకాలంలో తక్కువ శారీరక శ్రమ, ధమనుల సంకుచితం కారణంగా రక్తపోటు పెరగడం ప్రారంభమవుతుంది. ముఖ్యంగా ఎక్కువ ఒత్తిడిని తీసుకునేవారు లేదా వారి జీవన విధానం చెదిరిపోయేవారు. ఇతరులతో పోలిస్తే వీరికి బీపీ సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువ. ఎక్కువగా వేయించిన ఆహారం, జంక్ ఫుడ్ తినడం, ఎలాంటి వ్యాయామం చేయకపోవడం, నిద్ర సరిగా పట్టకపోవడం వల్ల రక్తపోటు సమస్య వస్తుంది. అటువంటి పరిస్థితిలో మీ ఆహారంలో కొన్ని సహజమైన వాటిని చేర్చండి.అధిక రక్తపోటు రోగులకు అల్లం తినడం చాలా ప్రయోజనకరమైన, సహజమైన ఆహారం. అల్లం తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉండటమే కాకుండా అనేక ఇతర వ్యాధులను కూడా నయం చేస్తుంది. చలికాలంలో అల్లంను మీ ఆహారంలో భాగం చేసుకోండి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, అల్లం బీపీని నార్మల్‌గా ఉంచడంలో సహాయపడుతుంది.మధుమేహ వ్యాధిగ్రస్తులు శీతాకాలంలో ప్రతిరోజూ అల్లం తినాలి. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అల్లం తీసుకోవడం వల్ల గొంతు నొప్పి, దగ్గు, కఫం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. దీని కోసం మీరు అల్లం టీ తాగవచ్చు.చలికాలంలో అల్లం తప్పనిసరిగా తీసుకోవాలి. అల్లంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి శరీరంలోని ఏ భాగంలోనైనా వాపును తగ్గించడంలో ప్రభావవంతంగా ఉంటాయి. అల్లం తినడం వల్ల శరీరం డిటాక్సిఫై అవుతుంది. కీళ్లు, కండరాలలో నొప్పి ఉంటే అల్లం తీసుకోవడం ప్రయోజనకరంగా పరిగణిస్తారు.అల్లం రసంను నిత్యం సేవిస్తే రక్త సరఫరా మెరుగు పడుతుంది. రక్తనాళాల్లో ఏర్పడే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో హార్ట్ ఎటాక్‌లు రాకుండా ఉంటాయి. ఆర్థరైటిస్ వల్ల కలిగే నొప్పి, వాపులను తగ్గించడంలో అల్లం సమర్థవంతంగా పనిచేస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రతి రోజూ అల్లంను తగిన మోతాదులో తీసుకుంటే ఆర్థరైటిస్ నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం పొందవచ్చని చెబుతున్నారు.

## కిడ్నీలను డ్యామేజ్ చేసే అలవాట్లు

హెల్త్ న్యూస్,18 జనవరి (క్రాంతిన్యూస్ ):కిడ్నీ డ్యామేజ్ ఇటీవలి కాలంలో కిడ్నీల సమస్యలతో ఎక్కువమంది బాధపడుతున్నారు. కిడ్నీలలో రాళ్లు, ఇన్ఫెక్షన్స్ తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. కిడ్నీలను పాడుచేసే పది అలవాట్లు ఇలాంటివారిలో కనబడుతాయి.రోజుకి కనీసం 3 లీటర్లు మంచినీళ్లు తాగాలి కానీ తక్కువ నీరు తాగటం వల్ల సమస్య వస్తుంది. ప్రతి చిన్నదానికి ఎక్కువగా మందులు వాడటం వల్ల కిడ్నీల్లో రాళ్లు ఏర్పడవచ్చు. ఉప్పు ఎక్కువగా వాడేవారిలో సైతం ఈ సమస్య వస్తుంది. మూత్రం వచ్చినా గట్టిగా ఆపుకుంటూ ఎక్కువసేపు అలాగే వుండటం. మాంసాహారం విపరీతంగా తినడం వల్ల కూడా సమస్య వస్తుంది.సరైన నిద్ర సమయాలను పాటించకపోవడం. శీతల పానీయాలు అధికంగా తాగడం వల్ల కూడా కిడ్నీ స్టోన్స్ రావచ్చు.మోతాదుకి మించిపోయి కడుపుకి ఆహారాన్ని లాగించడం.ఇన్ఫెక్షన్స్ కూడా కిడ్నీ స్టోన్స్ ఏర్పడటానికి కారణమవుతాయి.



# మీ లివర్ ప్రమాదంలో ఉందనడానికి చర్మంపై ఈ లక్షణాలు సంకేతాలా..

హెల్త్ న్యూస్,18 జనవరి (క్రాంతిన్యూస్ ): కాలేయం మన శరీరానికి చాలా ముఖ్యమైన అవయవం. శరీరం నుంచి విషాన్ని తొలగించడానికి.. అదేవిధంగా ఆరోగ్యాన్ని కాపాడటానికి లివర్ ఎన్నో విధులను నిర్వహిస్తుంది.. కాలేయం.. జీర్ణక్రియను మెరుగుపరచడానికి హార్మోన్ల సమతుల్యతను కాపాడుకోవడానికి, విటమిన్లు, ప్రోటీన్లు, ఇతర వస్తువులను నిల్వ చేయడం ద్వారా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి ఇది చాలా ఉపయోగకరమైన అవయవమని వైద్య నిపుణులు చెబుతున్నారు.. శరీరంలో కాలేయం సరిగా పనిచేయకపోతే ఆ వ్యక్తి ఎక్కువ కాలం జీవించలేడు. అటువంటి పరిస్థితిలో, ఒక వ్యక్తి తన కాలేయ సంరక్షణ.. ఆరోగ్యం గురించి ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలి.

కాలేయం ఆరోగ్యవంతంగా ఉండాలంటే ముఖ్యంగా ఆహారంపై శ్రద్ధ పెట్టడం చాలా అవసరం. చాలా సార్లు కాలేయం పనిచేయకపోవడం, వైఫల్యం అనేది గుర్తించకుండానే జరుగుతుంది.. ముందుగా గుర్తిస్తే చికిత్స సులభం.. ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.. కాలేయం ఇబ్బందుల్లో పడితే.. దాని లక్షణాలు వ్యక్తి ముఖం.. శరీరంపై కనిపించడం ప్రారంభిస్తాయి.

ఒక వ్యక్తి ముఖం లేదా శరీరంపై అలాంటి లక్షణాలు కనిపిస్తే, వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. వీటిలో కామెర్లు, అలసట, బలహీనత, కడుపు నొప్పి లేదా వాపు, ఆకలి లేకపోవడం, వాంతులు లేదా వికారం, నలుపు లేదా ముదురు మూత్రం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.. మీకు ముఖ్యంగా ఈ లక్షణాలు ఏవైనా అనిపిస్తే, వెంటనే మీ వైద్యుడిని సంప్రదించండి.కామెర్లు: కామెర్లు ఒక సాధారణ లక్షణం.. దీనిలో చర్మం, కళ్ళు పసుపు రంగులోకి మారుతాయి. మొహంపై మొటిమలు పెరుగుతాయి.. ముఖం గ్లో కూడా తగ్గుతుంది. కాలేయం బిలిరుబిన్‌ను సరిగ్గా క్లియర్ చేయలేనప్పుడు ఇది జరుగుతుంది.

చర్మంపై దురద – నీరసం: కాలేయ వైఫల్యం కారణంగా చర్మంపై దురద సంభవించవచ్చు. రక్తంలో కలుషితాలు చేరడం వల్ల దురద సమస్య పెరుగుతుంది. ఎల్లప్పుడూ నీరసంగా ఉంటుంది.

చర్మం, మొహం పై మచ్చలు: కాలేయ వైఫల్యం కారణంగా, చర్మంపై లేత లేదా ముదురు రంగు మచ్చలు లేదా బర్త్‌మార్క్‌లు కూడా కనిపిస్తాయి.. వీటిని “లివర్ స్పాట్స్” అని కూడా పిలుస్తారు.

నల్ల మచ్చలు: కాలేయ వైఫల్యం కారణంగా, శరీరంలో హార్మోన్ల మార్పులు కూడా సంభవిస్తాయి.. ఇది చర్మం రంగును ప్రభావితం చేస్తుంది. నల్ల మచ్చలు కనిపించడానికి కారణమవుతుంది.


గోర్ల రంగు మారడం– చర్మం పొడిబారడం: కాలేయం దెబ్బతినడం వల్ల, గోళ్ల రంగు కూడా పసుపు రంగులోకి మారడం పెళసుగా మారడం కనిపసిస్తుంది.. ఇంకా చర్మం పొడిబారడం లేదా పగుళ్లు ఏర్పడే సమస్య రావచ్చు.

కాలేయ వ్యాధులు..

కాలేయంలో ఏదైనా సమస్య ఉంటే, ఒకేసారి అనేక వ్యాధులు వస్తాయి. కాలేయ సిర్రోసిస్, హెపటైటిస్, ఫ్యాటీ లివర్, కాలేయ క్యాన్సర్, కాలేయ వైఫల్యం వంటి అనేక తీవ్రమైన వ్యాధులు సంభవించవచ్చు.. ఇవి తీవ్రమైన ప్రమాదాన్ని సూచిస్తాయి



## గ్యాస్ సమస్యకు ఈజీగా చెక్ పెట్టేసేయండి ఇలా



హెల్త్ న్యూస్,18 జనవరి (క్రాంతిన్యూస్ ):మనలో చాలా మంది ఆలోచించకుండా ఫాస్ట్ ఫుడ్, బిర్యానీ, శనిగపిండితో చేసిన స్నాక్స్ వంటివి ఎక్కువగా తీసుకుంటాం. అలాగే కొన్ని సార్లు బయట భోజనం చేయాల్సి వస్తుంది. ఇలాంటి ఆహార అలవాట్ల వల్ల అజీర్తి, గ్యాస్, లేదా కడుపు ఉబ్బరం వంటి సమస్యలు ఎదురవుతాయి. కడుపు నొప్పి, గుండెల్లో మంట వంటి లక్షణాలు మనం చూస్తుంటాం. కానీ కొన్ని సహజ చిట్కాలతో ఈ సమస్యలను ఎదుర్కోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

జీర్ణ సమస్యలకు పుదీనా బెస్ట్ ఆప్షన్

పుదీనా ఆకులు జీర్ణక్రియకు ఎంతో మంచి ప్రయోజనం కలిగిస్తాయి. పుదీనా ఆకులలోని ఔషధ గుణాలు కడుపు సమస్యలను తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం, నొప్పి వంటి సమస్యల నివారణకు పుదీనా చక్కటి పరిష్కారం. ఉదయం పూట ఒక్క పుదీనా ఆకులు నమిలితే అవి తక్షణ ఉపశమనం ఇస్తాయి. పుదీనా టీ కూడా చాలా ఉపయోగకరమైనది. ఇది కడుపు నొప్పి, ఉబ్బరం తగ్గించేందుకు మంచి సహాయాన్ని ఇస్తుంది. ఇది కడుపు సమస్యలకు ఆప్షనల్‌గా తీసుకోవచ్చు.

హెర్బల్ టీలు

గ్యాస్ సమస్యల నుంచి ఉపశమనం పొందడానికి హెర్బల్ టీలు ఒక మంచి పరిష్కారం అంటున్నారు. ఈ టీలు జీర్ణక్రియను మెరుగుపరచటంలో సహాయపడతాయి. పైగా కడుపు లోపాలను నివారించేందుకు మేలు చేస్తాయి. ఉదాహరణకి, మెంతులు, అల్లం, పుదీనా ఆకులు, తులసి వంటివి, పండ్లు, కషాయాలు గ్యాస్ సమస్యలకు మంచి మందులట. ఈ హెర్బల్ టీలు జీర్ణవ్యవస్థను దృఢపరచి, అజీర్తి, గ్యాస్ వంటి సమస్యలను తగ్గిస్తాయి. ఈ టీలు రెగ్యులర్‌గా తీసుకుంటే, జీర్ణ సమస్యలకు నిలకడైన పరిష్కారం లభిస్తుందంటున్నారు నిపుణులు.

మెంతులతో గ్యాస్ సమస్యలకు చెక్

మెంతులు ఎప్పుడూ మన ఆహారంలో ఉండే ఒక ముఖ్యమైన భాగం. ఇవి కేవలం రుచిని మాత్రమే ఇవ్వవు, అవి జీర్ణవ్యవస్థకు కూడా మేలు చేస్తాయి. మెంతులు యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలతో నిండినవి, వీటివల్ల కడుపు నొప్పులు, ఉబ్బరం, అజీర్తి లాంటి సమస్యలు తగ్గిపోతాయి. మెంతులు జీర్ణక్రియను సమర్థవంతంగా పని చేసేందుకు సహాయపడతాయి. కొన్ని అధ్యయనాలు మెంతులు జీర్ణ వ్యవస్థ రక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని సూచిస్తున్నాయి. మీరు మెంతుల్ని వంటల్లో ఉపయోగించవచ్చు లేదా నీటిలో ఉడికించి ఆ నీటిని తాగినా ఈ సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు.

మనం క్రమం తప్పకుండా ఎదురయ్యే ఆహారపు అలవాట్ల వల్లే అజీర్తి, గ్యాస్, లేదా కడుపు ఉబ్బరం వంటి సమస్యలు ఎదురవుతాయి. దీంతో మనం ఏం తినాలి, ఎప్పుడు తినాలి అనే విషయంలో క్లారిటీ ఉండదు. పైన చెప్పిన విధంగా పాటించడం వల్ల ఈ సమస్యలకు చెక్ పెట్టొచని నిపుణులు సూచిస్తున్నారు. ఈ పరిష్కారాలు సహజమైనవి కావడంతో, అవి వ్యక్తుల ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చు. అందుకే, ఏ విధమైన పరిష్కారానికైన ముందుగా సంబంధిత నిపుణులతో సంప్రదించడం మంచిది.

# ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ ఫేవరేట్ పాకిస్తాన్..! సునీల్ గవాస్కర్ జోష్యం..!



స్పోర్ట్స్ న్యూస్,18 జనవరి (క్రాంతిన్యూస్ ):ఈ ఏడాది ఫిబ్రవరి 19 నుంచి చాంపియన్స్ ట్రోఫీ జరుగనున్నది. ఐసీసీ ఈవెంట్ హైబ్రిడ్ మోడల్‌లో జరుగనుండగా.. పాకిస్తాన్, దుబాయి ఆతిథ్యం ఇవ్వనున్నాయి. టీమిండియా మ్యాచులన్నీ దుబాయిలో జరునుండగా.. మిగతా మ్యాచులన్నీ పాక్‌లో జరుగనున్నాయి. టోర్నీలో ఎనిమిది జట్లు బరిలోకి దిగనున్నాయి. టోర్నీలో ఏ జట్టు గెలుస్తుందో టీమిండియా మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ జోష్యం చెప్పారు. చాంపియన్స్ ట్రోఫీలో జట్ల మధ్య పోరు ఉంటుందని.. అయితే, పాక్‌కు మాత్రమే గెలిచే అవకాశాలున్నాయని.. హాట్ ఫేవరేట్ ట్యాగ్‌ను ఆతిథ్య జట్టుకే ఇవ్వాలని టీమిండియా దిగ్గజం పేర్కొన్నారు.

మొహమ్మద్ రిజ్వాన్ నేతృత్వంలోని జట్టు రావల్పిండిలో బంగ్లాదేశ్‌తో తొలి మ్యాచ్ ఆడనున్నది. 2023 వన్డే ప్రపంచ కప్ సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైన పాకిస్తాన్.. ఇటీవల ఐసీసీ టోర్నీలో ఘోరంగా విఫలమైంది. గతేడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో గ్రూప్ దశ నుంచే ఇంటిబాట పట్టింది. అయినా.. పాక్ సొంత గడ్డపై రాణించి టైటిల్ వేటలో ప్రత్యర్థులను సవాల్ చేయగలదని గవాస్కర్ పేర్కొన్నారు. సొంత గడ్డపై ఏ పరిస్థితుల్లో ఏ జట్టునైనా ఓడించడం అంత సులువైన విషయం కాదన్నారు. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ భారత్ ఓడిపోయిందని.. అంతకు ముందు వరుస మ్యాచుల్లో గెలిచిన విషయాన్ని గవాస్కర్ గుర్తు చేశారు. ప్రస్తుతం పాక్‌కు అలాంటి అవకాశాలే ఉన్నాయన్న ఆయన.. అందుకే రాబోయే టోర్నమెంట్‌లో పాక్ ఫేవరేట్ జట్టుగా నిలుస్తుందని తాను భావిస్తున్నాన్నారు.

# రంజీ ట్రోఫీలో ఆడడంపై నోరు విప్పిన రోహిత్

స్పోర్ట్స్ న్యూస్,18 జనవరి (క్రాంతిన్యూస్ ): దేశవాళీ క్రికెట్‌లో టీమిండియా సీనియర్ ఆటగాళ్లు ఆడటంపై వాడివేడిగా చర్చ సాగుతోంది. ఇలాంటి సమయంలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఓ కీలక నిర్ణయం తీసుకుని ముంబైకి రంజీ ట్రోఫీ ఆడాలని నిర్ణయించుకున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి జట్టును ప్రకటించిన సమయంలోనే ఈ వివరాలు ప్రకటించేశాడు. నిరంతర బిజీ షెడ్యూల్ కారణంగా గత కొన్నేళ్లుగా ఆడటం కష్టమైందని, అయితే ఈసారి మైదానంలోకి దిగుతానని రోహిత్ చెప్పుకొచ్చాడు. అంటే దాదాపు 9-10 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత రోహిత్ రంజీ ట్రోఫీ టోర్నీలో ఆడనున్నాడు. ముంబైలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీమ్ ఇండియా ప్రకటన తర్వాత, ఎంపికకు సంబంధించిన అంశాలపై మాత్రమే కాకుండా, కెప్టెన్ రోహిత్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌లను దేశవాళీ క్రికెట్ ఆడే సీనియర్ ఆటగాళ్ల గురించి కూడా ప్రశ్నలు సంధించారు. ఈ సమయంలో ఇద్దరూ ఖచ్చితంగా ఏ ఆటగాడు అందుబాటులో ఉంటే.. ఆ ఆటగాడు ఆడతాడని తెలిపారు. ముంబైతో జరిగే తదుపరి మ్యాచ్‌కు తాను అందుబాటులో ఉన్నట్లు రోహిత్ ఇక్కడే చెప్పేశాడు. జనవరి 23 నుంచి జమ్మూకశ్మీర్‌తో ముంబై




జట్టు రంగంలోకి దిగనుంది. రోహిత్ అంతకుముందు 2015లో తన చివరి రంజీ మ్యాచ్ ఆడాడు.ఈ సమయంలో, టీమ్ ఇండియా కెప్టెన్ మాట్లాడుతూ, గత 7-8 సంవత్సరాలలో, టీమ్ ఇండియా క్యాలెండర్ చాలా బిజీగా ఉందని, అంతర్జాతీయ సిరీస్, ఐపీఎల్ వంటి టోర్నమెంట్ల తర్వాత ఆటగాళ్లకు కూడా కొన్ని రోజుల విరామం అవసరం. అప్పుడే తాజాగా ఉండగలరు. నేను టెస్టు జట్టులో ఆడుతున్న 7 సంవత్సరాల నుంచి నాకు అవకాశం లభించలేదు. ఇన్ని సంవత్సరాలలో, క్రికెట్ జరుగుతున్నప్పుడు కూడా మేం ఇంట్లో వరుసగా 45 రోజులు కూడా గడపలేకపోయాం. అన్ని ఫార్మాట్లలో ఆడని ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్‌లో ఆడవచ్చు' అంటూ చెప్పుకొచ్చాడు. ఢిల్లీ తరపున రంజీ ట్రోఫీ ఆడతాడా లేదా అని తన తోటి సీనియర్ ఆటగాడు, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీపై అందరి చూపు చూస్తున్న తరుణంలో రోహిత్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఫిట్‌నెస్ కారణంగా జనవరి 23 నుంచి జరగనున్న మ్యాచ్‌లో ఆడేందుకు విరాట్ నిరాకరించినట్లు సమాచారం. మెడనొప్పి కారణంగా ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండలేకపోతున్నానని కోహ్లీ వెల్లడించినట్లు సమాచారం. అతనితో పాటు, కేఎల్ రాహుల్ కూడా మోచేయి గాయం కారణంగా కర్ణాటక తదుపరి మ్యాచ్‌లో ఆడేందుకు నిరాకరించాడు. అయితే, రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ తమ తమ జట్లతో ఆడనున్నారు.

# కొత్త కెప్టెన్ ను ప్రకటించనున్న లక్నో..



స్పోర్ట్స్ న్యూస్,18 జనవరి (క్రాంతిన్యూస్ ):లక్నో సూపర్ జెయింట్స్ గత సీజన్లలో ప్లేఆఫ్ స్థాయి జట్టుగా నిలిచినప్పటికీ, ఐపీఎల్ 2024లో తమ ప్రదర్శనతో నిరాశపరిచింది. పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో నిలిచిన LSG లో-నెట్ రన్ రేట్ కారణంగా ప్లేఆఫ్‌ను కోల్పోయింది. ఈ నేపథ్యంలో, IPL 2025 సీజన్‌కు ముందుగా తమ కొత్త కెప్టెన్‌ను ప్రకటించేందుకు సిద్ధమైంది. జనవరి 20న కోల్‌కతాలోని RPSG ప్రధాన కార్యాలయంలో జరగబోయే విలేకరుల సమావేశంలో, కొత్త కెప్టెన్ పేరును వెల్లడిస్తారని సమాచారం. ఫ్రాంచైజీ కొత్త జెర్సీ ఆవిష్కరణ కూడా జరిగే అవకాశం ఉంది. సంజీవ్ గోయెంకా, RPSG గ్రూప్ చైర్మన్, ఈ సమావేశంలో ప్రసంగించనున్నారు.

కెప్టెన్సీ రేసులో ఇద్దరు ప్రధాన అభ్యర్థుల పేర్లు జోరుగా ప్రచారం జరుగుతుంది.

1. రిషబ్ పంత్: ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధరగా రూ. 27 కోట్లకు 2024 మెగా వేలంలో లక్నో ద్వారా కొనుగోలు చేయబడ్డ పంత్, కెప్టెన్సీ రేసులో ముందు ఉన్నాడు. 2021-2024 మధ్య ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా ఉన్న పంత్, తన కెప్టెన్సీ అనుభవంతో ప్రత్యేకంగా నిలుస్తున్నాడు. 2023 సీజన్ మినహా, ఇతర సీజన్లలో అతని నాయకత్వం జట్టుకు బలాన్నిచ్చింది. 2. నికోలస్ పూరన్:ఈ వెస్టిండీస్ స్టార్ బ్యాటర్, లక్నో ప్రధాన ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. 2024 సీజన్‌లో పూరన్ అత్యధిక రన్స్ సాధించాడు. ప్రస్తుతం ILT20లో MI ఎమిరేట్స్‌కు నాయకత్వం వహిస్తున్న పూరన్, ఫ్రాంచైజ్ క్రికెట్‌లో కెప్టెన్సీ అనుభవం కలిగి ఉన్నాడు.కెఎల్ రాహుల్ నిష్క్రమణతో వచ్చిన మార్పు:2022 నుంచి లక్నో కెప్టెన్‌గా వ్యవహరించిన కెఎల్ రాహుల్, 2024లో సన్ రైజర్స్ హైదరాబాద్ తో జరిగిన ఓటమి తర్వాత యజమాని సంజీవ్ గోయెంకాతో వచ్చిన మనస్పర్థల కారణంగా జట్టును విడిచాడు. నవంబర్ 25 న జరిగిన వేలంలో రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరాడు. గతంలో ముంబై ఇండియన్స్‌తో పని చేసిన జహీర్ ఖాన్, ప్రస్తుతం లక్నో జట్టుకు మెంటార్‌గా సేవలందిస్తున్నాడు. అతని మార్గదర్శకత్వంలో, జట్టు పునర్నిర్మాణం చేపట్టనుంది.ఈసారి కొత్త కెప్టెన్ ఆధ్వర్యంలో, లక్నో ఐపీఎల్ 2025లో సత్తా చాటాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సీజన్లో అయినా తొలి టైటిల్ కైవసం చేసుకోవాలని మాస్టర్ ప్లాను వేస్తుంది. రిషబ్ పంత్ తన అనుభవంతో ముందస్తు ఎంపికగా కనిపిస్తుండగా, పూరన్ కూడా సమర్థమైన ప్రత్యామ్నాయంగా ఉంది. జనవరి 20న విలేకరుల సమావేశంలో వీరిలో ఎవరు కొత్త కెప్టెన్‌గా ఎంపికవుతారో వేచి చూడాల్సిందే.

# స్క్వాడ్ లో ఉంటాడు కానీ ఆడటం డౌటేనా? స్టార్ పేసర్ పై అగార్కర్ క్లారిటీ!

స్పోర్ట్స్ న్యూస్,18 జనవరి (క్రాంతిన్యూస్ ): భారత క్రికెట్ జట్టు స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాను చాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం 15 మంది సభ్యుల జట్టులో ఎంపిక చేసినప్పటికీ, అతని లభ్యత పూర్తిగా ఫిట్‌నెస్ స్థాయిపై ఆధారపడి ఉంటుంది అని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అన్నారు. ఇటీవలే ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరిగిన చివరి టెస్టు మ్యాచ్‌లో, వెన్ను నొప్పి కారణంగా బుమ్రా ఐదో రోజు బౌలింగ్ చేయలేకపోయాడు.




చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఒక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, “బుమ్రా ఐదు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్య బృందం సూచించింది. అతను ఇంగ్లాండ్‌తో జరిగే మొదటి రెండు వన్డేలకు అందుబాటులో ఉండడు. ఫిబ్రవరి ప్రారంభంలో అతని ఫిట్‌నెస్ స్థితి తెలియజేస్తామని బీసీసీఐకి స్పష్టం చేస్తాం” అని చెప్పారు.బుమ్రా ఫిట్‌నెస్‌పై ఇంకా అనిశ్చితి కొనసాగుతుండగా, చాంపియన్స్ ట్రోఫీ కోసం తుది జట్టును ఫిబ్రవరి 11 నాటికి ICCకి సమర్పించాల్సి ఉంటుంది. రోహిత్ శర్మ మాట్లాడుతూ, “మేము బుమ్రా స్థితి ఖచ్చితంగా తెలియజేసే వరకు, అవసరమైన మార్పులు చేస్తాము” అని చెప్పారు.

భారత జట్టు స్ట్రాటజీకి బుమ్రా కీలకంగా ఉండటంతో, అతని ఆరోగ్య పరిస్థితి టోర్నమెంట్ విజయానికి ప్రధాన పాత్ర పోషించనుంది. ఇంగ్లాండ్‌తో మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌లో, బుమ్రా స్థానంలో హర్షిత్ రాణాను ఎంపిక చేశారు. మూడు మ్యాచ్‌లు ఫిబ్రవరి 6, 9, 12 తేదీల్లో నాగ్‌పూర్, కటక్, అహ్మదాబాద్‌లలో జరుగనున్నాయి.

గ్రూప్-Aలో భారత జట్టు

భారతదేశం గ్రూప్-A లో ఉంది. పాకిస్తాన్‌కు వెళ్లడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వనందున, వారి మ్యాచ్‌లు దుబాయ్‌లో జరుగుతాయి. భారత్ ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో తమ ఛాంపియన్స్ ట్రోఫీని ప్రారంభించనుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 23న పాకిస్తాన్తో, మార్చి 2న న్యూజిలాండ్‌తో తలపడనుంది.




# సంక్రాంతికి వస్తున్నాం’ 2 మిలియన్ మార్క్ క్రాస్




మూవీ న్యూస్,18 జనవరి (క్రాంతిన్యూస్ ):ఈ సంక్రాంతి బరిలో నిలిచి.. సంక్రాంతి విన్నర్‌గా నిలిచిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. 2024లో మీడియం రేంజ్ సినిమాగా వచ్చిన హనుమాన్ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడు ఆ రికార్డ్‌ను సంక్రాంతికి వస్తున్నాం సినిమా బ్రేక్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2025 సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన మూడు సినిమాల్లో సంక్రాంతికి వస్తున్నాం సినిమాకు బ్లాక్ బస్టర్ సక్సెస్ టాక్ దక్కింది. ఫ్యామిలీ ఆడియన్స్ విడుదలైన రోజు నుంచి థియేటర్ల వద్ద క్యూ కడుతున్నారు. ఇప్పటికే రూ.130 కోట్ల వసూళ్లు క్రాస్ చేసింది. వీకెండ్ పూర్తి అయ్యేప్పటికి వసూళ్లు రూ.200 కోట్లను క్రాస్ చేసినా ఆశ్చర్యం లేదు. సినిమా తాజాగా మరో అరుదైన మైలు రాయిని క్రాస్ చేసిందని యూనిట్ సభ్యులు ప్రకటించారు. బుక్ మై షో ద్వారా సంక్రాంతికి వస్తున్నాం సినిమాకి 5 రోజుల్లోనే 20 లక్షల టికెట్లు బుక్ అయ్యాయి. ఈ వీకెండ్ పూర్తి అయ్యేప్పటికి ఆ సంఖ్య మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. సినీ విశ్లేషకుల అంచనా ప్రకారం ఈ సినిమా లాంగ్ రన్ పూర్తి అయ్యేప్పటికి 3.5 నుంచి 4 మిలియన్‌ల టికెట్లు బుక్ మై షో ద్వారా బుక్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈమధ్య కాలంలో ఇంత స్పీడ్‌గా రెండు మిలియన్‌ల టికెట్లు బుక్ అయిన సినిమాలు చాలా అరుదుగా ఉంటున్నాయి. పుష్ప 2 సినిమా తర్వాత అంత స్పీడ్‌గా టికెట్లు బుక్ కావడం ఈ సినిమాకే అంటూ సినీ వర్గాల్లో, బాక్సాఫీస్ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది.

# నాని ప్రొడక్షన్‌లో ప్రియదర్శి ‘కోర్టు’.. విడుదల తేదీ ఖరారు.!




మూవీ న్యూస్,18 జనవరి (క్రాంతిన్యూస్ ): టాలీవుడ్ నటుడు నేచురల్ స్టార్ నాని సమర్పణలో వాల్ పోస్టర్ పతాకంపై వస్తున్న తాజా చిత్రం కోర్ట్ష్ట్ వర్సెస్ ఏ నోబడీ అనేది ఉపశీర్షిక. ఈ సినిమాలో ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. నూతన దర్శకుడు రామ్ జగదీశ్ తెరెకెక్కించనున్నారు. ప్రశాంతి ఈ సినిమాను నిర్మిస్తుంది. గత ఏడాది ఆగష్టులో షూటింగ్ స్టార్ట్ చేసిన ఈ చిత్రం ఇటీవలే షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అయితే తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాను ఉగాది పండుగా కానుకగా మార్చి 14న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఈ సందర్భంగా స్పెషల్ వీడియోను పంచుకుంది.”నువ్వు మరి నేను అనుకున్నంత ఎదవవు ఏం కాదు. అంటే ఎంతో కొంత ఎదవనే అంటావు. ఏ కాదా.. సర్లే ఉండు.. నేను వెళ్లాలి.. హలో హలో.. నీ పేరు ఏంటి.. జాబిలి.. మరి నీ పేరు”.. అంటూ బ్యాక్‌గ్రౌండ్ వాయిస్‌తో ఈ వీడియో ప్రారంభమైంది. వీడియో చూస్తుంటే.. అన్యాయంగా ఓ కేసులో ఇరుక్కుపోయిన ఓ పేదింటి కుర్రాడు న్యాయం కోసం పోరాడే కథతో ఈ సినిమా రాబోతుంది. ఇందులో ప్రియదర్శి లాయర్ పాత్రలో నటించబోతున్నాడు. కాగా ఈ చిత్రంలో శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్షవర్ధన్, శ్రీదేవి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# పవన్ కళ్యాణ్, ప్రభాస్ సినిమాల కోసం ఆ బడా సినిమాలన్నీ వదులుకుందా.?



మూవీ న్యూస్,18 జనవరి (క్రాంతిన్యూస్ ):నిధి అగర్వాల్.. సాలిడ్ హిట్ పడలేదు కానీ ఈ అమ్మడి పేరు టాలీవుడ్ లో ఇప్పుడు మారుమ్రోగేది. ఈ హాట్ బ్యూటీ భారీ హిట్ కోసం చాలా రోజులుగా ఎదురుచూస్తుంది. బాలీవుడ్ నుంచి ఇండస్ట్రీకి వరుస సినిమాలతో దూసుకుపోతుంది ఈ అమ్మడు. ఈ ముద్దుగుమ్మ తెలుగులో అనుకున్నంతగా సక్సెస్ కాలేకపోయింది. వరుసగా యంగ్ హీరోల సినిమాల్లో అవకాశాలు అందుకున్నప్పటికీ అనుకున్నంతగా గుర్తింపు తెచ్చుకోలేకపోయింది. అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్య నటించిన సవ్యసాచి సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది. డిఫరెంట్ కాన్సెప్ట్ తో తెరకెక్కిన ఈ మూవీ ప్రేక్షకులకు పెద్దగా కనెక్ట్ కాలేదు. ఆతర్వాత అక్కినేని అఖిల్ సరసన మిస్టర్ మజ్ను సినిమాలో నటించింది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. దాంతో ఈ అమ్మడు గ్లామర్ గేట్లు ఎత్తేసింది . మిస్టర్ మజ్ను సినిమా తర్వాత రామ్ పోతినేని, పూరిజగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో హిట్ అందుకుంది. ఈ సినిమాలో తన నటనతోపాటు అందంతోనూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు పవన్ కళ్యాణ్ హరిహరవీరమల్లు, ప్రభాస్ రాజా సాబ్ సినిమాలు చేస్తుంది. ఈ రెండు సినిమాల షూటింగ్స్ తో తెగ బిజీగా ఉందట ఈ అమ్మడు. కాగా ఈ రెండు సినిమాల బిజీ కారణంగా ఆమె చాలా సినిమాలను మిస్ చేసుకుందని తెలుస్తుంది.

# ఆ దర్శకుడు నన్ను పొట్టిబట్టలు వేసుకోమన్నాడు.



మూవీ న్యూస్,18 జనవరి (క్రాంతిన్యూస్ ):సినిమా ఇండస్ట్రీ అనేది ఓ రంగుల ప్రపంచం. ఈ ఈ రంగుల లోకంలో ఎదగాలని తామంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవాలని ఎంతో మంది హీరోయిన్స్ కలలు కంటుంటారు. కాగా కొంతమందికి అవకాశాలు వస్తే మరికొంతమంది అవకాశాల కోసం ప్రయత్నిస్తూ ఉంటారు. అయితే అవకాశాల కోసం ఎదురుచూసే వారిని లోబరుచుకోవడానికి కొందరు ప్రయత్నిస్తూ ఉంటారు. ఇదే కాదు హీరోయిన్స్ గా మారిన తర్వాత కూడా కొంతమంది లైంగిక వేధింపులకు గురైన వారు కూడా ఉన్నారు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్స్ క్యాస్టింగ్ కౌచ్ పై తమ గొంతు విప్పారు. తాజగా ఓ స్టార్ హీరోయిన్ కూడా తనకు ఎదురైనా చేదు అనుభవాన్ని తెలిపింది. తెలుగు, తమిళ్ భాషల్లో తనకు ఓ గుర్తింపు తెచ్చుకున్న ఆ స్టార్ హీరోయిన్ కు కూడా ఓ చేదు అనుభవం ఎదురైందట.సినిమాఇండస్ట్రీలో తనకు ఎదురైన చేదు అనుభవాలను బయటపెట్టింది నటి లైలా. ఈ ముద్దుగుమ్మ చాలా మందికి తెలిసే ఉంటుంది. ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా రాణించింది లైలా. ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించింది. తెలుగుతో పాటు తమిళ్ లోను సత్తా చాటింది ఈ అమ్మడు. ఆతర్వాత సినిమాలు తగ్గించిన లైలా.. ఇటీవలే సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టింది. తాజాగా లైలా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ షాకింగ్ కామెంట్స్ చేసింది. పొట్టి స్కర్టులు, తక్కువ టాప్స్ వేసుకోమని అడిగే దర్శకులు చాలా మంది ఉన్నారని లైలా తెలిపింది.ప్యాడ్స్ పెట్టుకోమని కూడా దర్శకులు చెప్పారని లైలా ఇంటర్వ్యూలో వెల్లడించింది. కానీ లైలా మాత్రం అందుకు ఒప్పులేదట. కుదరదు అని ఖరాకండిగా చెప్పిందట. ఒక దర్శకుడు నాకు షార్ట్ స్కర్ట్ ఇచ్చాడు. నువ్వు ధరించాలి, అది నీకు గ్లామర్‌గా ఉంటుంది అని చెప్పాడు. ఇప్పటి వరకు హోమ్లీ క్యారెక్టర్లు చేశావు. ఇది కూడా ట్రై చెయ్యి అన్నాడు. నేను అంగీకరించాను. నేను పొట్టి స్కర్ట్ వేసుకున్నాను. అయితే నేను గ్లామర్‌గా కనిపించడం లేదని, బొమ్మలా కనిపిస్తానని చెప్పాడు. నువ్వు వేసుకోమని అడిగినందుకే పొట్టి స్కర్ట్ వేసుకున్నానని కూడా చెప్పాను అని తెలిపింది. కానీ అలాంటి పాత్రలు చేయడం నాకు ఇష్టం లేదు. కొంతమంది గ్లామర్ పాత్రలు పోషిస్తున్నారు. అది వారి ఇష్టం. ప్రతి ఒక్కరికి బలాలు, బలహీనతలు ఉంటాయి. అని లైలా అన్నారు. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com